
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 23 | సంచిక : 204 | ది. 18-10-2024 | విజయవాడ | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## ఏపీలో వైసీపీ కోఆర్డినేటర్లు నియామకం



**అమరావతి,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లాలకు వైస్సార్సీపీ కోఆర్డినేటర్లను పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం– ఎంపీ మిథున్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు – పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి కృష్ణా – ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఉమ్మడి ఈస్ట్, వెస్ట్ గోదావరి – బొత్స సత్యనారాయణ, ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం – విజయసాయిరెడ్డి, కడప, అనంతపురం, కర్నూల్– వైవీ సుబ్బారెడ్డిని నియమించారు.

# రాష్ట్రంలో పెట్టుబడులకు కొత్త పాలసీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం

● బెస్ట్ పారిశ్రామిక పాలసీలతో ఏపి ఇప్పుడు పెట్టుబడులకు సిద్ధంగా ఉందంటూ ముఖ్యమంత్రి ట్వీట్ ● ఏపీలో కార్యకలాపాలకు పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ స్వాగతం అంటూ ముఖ్యమంత్రి స్వాగతం ● సమర్థులైన యువత, స్నేహ పూర్వక ప్రభుత్వం, మౌలిక సదుపాయాలతో పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం అన్న ముఖ్యమంత్రి ● పెట్టబడులతో మీ వ్యాపారం పెరుగుతుంది...మా రాష్ట్రం వృద్ధి చెందుతుంది అంటూ సిఎం ఆహ్వానం



**అమరావతి,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** పెట్టుబడులు పెట్టేందుకు నేను పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతున్నా అంటూ ముఖ్యమంత్రి ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యాపార అనుకూల ప్రభుత్వమని, ప్రతిభావంతులైన యువత, ఉత్తమ మౌలిక సదుపాయాలు పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూల మాన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మా ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలతో చర్చించి కొత్త పాలసీలు తెచ్చిందనీ,కొత్త పాలసీలు వేగవంతమైన వ్యాపార నిర్వహణకు దోహదం చేస్తాయన్నారు.మేము దేశంలో అత్యుత్తమ వ్యాపార వాతారణ వ్యవస్థను నిర్మిస్తున్నామనీ, ౹రాష్ట్రంలో మీ వ్యాపారానికి ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తుందని నేను వ్యక్తిగతంగా మీకు హామీ ఇస్తున్నా అని పేర్కొన్నారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఇంతకంటే మంచి సమయం ఎప్పుడూ లేదనీ,అలాగే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి పెట్టడానికి కూడా ఇంతకంటే మంచి సమయం ఎప్పుడూ రాదన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులతో మీ వ్యాపారం పెరుగుతుంది....రాష్ట్ర సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మీ పెట్టుబడుల కోసం మేం ఎదురుచూస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్విట్టర్ లో పోస్ట్ చేశారు.



# విశాఖ, కాకినాడ తీరాల్లో భారీగా ఎగసిపడుతున్న అలలు

**విశాఖపట్నం/కాకినాడ/ నెల్లూరు,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** వాయుగుండం ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాలతో పాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో కొన్నిచోట్ల జనజీవనం స్తంభించింది. విశాఖపట్నం, కాకినాడ తీరాల్లో పెద్ద ఎత్తున సముద్రపు అలలు ఎగసిపడుతున్నాయి. విశాఖలోని ఆర్కే బీచ్ వద్ద అలలు దుకాణాలను తాకుతున్నాయి. వర్షానికి పెదగంట్యాడ మండలం కొంగపాలెంలో రేకుల షెడ్డు కూలింది. దీంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి.కాకినాడ జిల్లాలోని యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. భారీగా రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. చెట్లు, విద్యుత్, స్తంభాలు, ఇళ్లు నేల కూలాయి. అంతర్వేది తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. గోదావరి సంగమం వద్ద అలలు ఎగసిపడుతున్నాయి. పల్లిపాలెంలో ఇళ్లు, బీచ్ రోడ్డును అలలు ముంచెత్తాయి. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో అలలు ఉద్ధృతంగా ఎగసిపడుతున్నాయి. ఓఎన్‌జీసీ ప్లాంటును సముద్రపు నీరు తాకింది. ఆక్వా చెరువులను సముద్రం నీరు ముంచెత్తింది.

**తడ వద్ద తీరం దాటిన వాయుగుండం..** తిరుపతి జిల్లా తడ వద్ద వాయుగుండం తీరాన్ని దాటినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. గడిచిన 6 గంటలుగా 22 కి.మీ వేగంతో కదిలి తీరాన్ని తాకినట్లు తెలిపింది. అనంతరం అల్పపీడనంగా బలహీనపడింది. ఈ ప్రభావంతో రాష్ట్రంలోని పలు తీర ప్రాంత, రాయలసీమ జిల్లాలతో పాటు ఉత్తర తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

**జలాశయాలకు చేరుతున్న వరద..** శ్రీసత్యసాయి జిల్లా సి.కె.పల్లి మండలం వెల్దుర్తి సమీపంలో చిత్రావతి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వెల్దుర్తి, గంగినేపల్లి తండాలకు, ఎర్రోనిపల్లి, బ్రాహ్మణపల్లి, చిన్నప్పరెడ్డిపల్లి గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి. వైఎస్సార్ జిల్లాలో గండికోట జలాశయం, మైలవరం జలాశయాలకు వరద నీరు వచ్చి చేరతోంది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. పైడిపాలెం, వామికొండ, సర్వారాయ సాగర్ జలాశయాలకు వరద వచ్చి చేరుతోంది. నెల్లూరు నగర శివారులోని ఆటోనగర్, చంద్రబాబు నగర్, తల్పగిరి కాలనీ, జొన్నవాడ రోడ్డు, పొట్టేపాలెం కలుజు ప్రాంతాల్లో వర్షం కారణంగా రహదారులపై నీరు నిలిచింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బుధవారం రాత్రి వర్షానికి పంట తడిసింది. ఆరబోసిన మొక్కజొన్న, వేరు శనగ తడిసి రైతులకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల వరి నీటమునిగింది.

### వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష..

రాష్ట్రంలో భారీవర్షాలపై కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితిని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లా కలెక్టర్లు ఆయనకు వివరించారు. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వర్షాలు పడినట్లు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలపై అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. చెరువులు, వాగుల పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రవాహాలు, నీటి నిర్వహణ చర్యలను అధికారులు వివరించారు.

# త్వరలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తాం - రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర





**మోపిదేవి/అవనిగడ్డ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి సహకార వ్యవస్థకు పునరుత్తేజం కలిగించనున్నట్లు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గురువారం మోపిదేవిలో రూ.కోటీ తొమ్మిది లక్షలతో నూతనంగా నిర్మించిన కేడీసీసీ బ్యాంకు మోపిదేవి శాఖ నూతన భవనాన్ని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా జాయింట్ కలెక్టర్, కేడీసీసీ బ్యాంక్ పర్సన్ ఇంచార్జి గీతాంజలి శర్మ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రైతులకు విస్తృత సేవలు అందిస్తున్న సహకార వ్యవస్థను గత ఐదేళ్లలో నిర్వీర్యం చేశారని, అయితే అధికారులు కొంతమేరకు ఈ వ్యవస్థను రక్షించుకున్నారని తెలిపారు. ఈ సహకార వ్యవస్థకు మళ్ళీ పునరుజ్జీవం అందించేందుకు త్వరలో సహకార సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. బ్యాంకింగ్ వ్యవస్థలో రైతుల భాగస్వామ్యం కోసం భోగరాజు పట్టాభి సీతారామయ్య 1915లో చారిత్రాత్మకమైన కేడీసీసీ బ్యాంకును స్థాపించారని తెలిపారు. రైతులకు ఏ కష్టం వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది సహకార వ్యవస్థ అని తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు విద్యా రుణాలు, గోల్డ్ రుణాలు అందిస్తోందని తెలిపారు. మోపిదేవిలో నిర్మించిన ఈ శాఖ నూతన భవనం కార్పొరేట్ బ్యాంకులకు సమానంగా అన్ని సౌకర్యాలు కలిగి ఉందని, రైతులు ఈ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రైతాంగానికి విస్తృత సేవలు అందిస్తున్న సహకార వ్యవస్థపై గత ఐదేళ్లలో అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీలను నియమించి వాటినే రెన్యువల్ చేస్తూ గందరగోళ పరిస్థితి తెచ్చిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు సహకార వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చి సహకార రంగాన్ని పరిపుష్టం చేశారని, మళ్లీ గత ఐదేళ్లుగా అస్తవ్యస్తంగా మారిన సహకార వ్యవస్థకు నూతన ఉత్తేజం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, కేడీసీసీ బ్యాంకు జిల్లా సీఈఓ ఏ.శ్యాం మనోహర్, జీఎం బీ.ఎల్.చంద్రశేఖర్, ఏజీఎం జి.ప్రకాష్ రావు, చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు శాఖ చీఫ్ మేనేజర్ యలవర్తి నగ రాజ కుమారి, మోపిదేవి కేడీసీసీ బ్యాంకు బీఎం సల్మా సుల్తానా సయ్యద్, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, తహసీల్దార్ మేడపాటి శ్రీవిద్య, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, సహకార రంగ ప్రముఖులు పరుచూరి అంజియ్య, మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ మోటుమర్రి బాబా ప్రసాద్, సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంపీటీసీ కొమ్ము పవన్, పలువురు కూటమి నాయకులు, పీఏసీఎస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పెరగనున్న మద్యం ధరలు?



**హైదరాబాద్,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** మద్యం ధరలను పెంచాలని కోరుతున్న బ్రూవరీలు మద్యం ధరలు 15 శాతం వరకు పెరిగే అవకాశం మద్యంపై రూ.20 నుంచి రూ.150 వరకు పెరిగే అవకాశం మద్యం ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైనట్లుగా మీడియాలో కథనాలు వస్తున్నాయి. మద్యం ధరలు పెంచాలని బ్రూవరీలు... ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రభుత్వం కూడా అందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. అదే జరిగితే ధరలు 15 శాతం వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా ప్రభుత్వం ధరలను ప్రతి రెండేళ్లకోసారి పెంచుతుంది. వివిధ రకాల మద్యంపై రూ.20 నుంచి రూ.150 వరకు పెంచాలని బ్రూవరీలు ప్రభుత్వాన్ని కోరాయి. తెలంగాణలోని 6 బ్రూవరీల్లో ప్రతి సంవత్సరం 88 కోట్ల లీటర్ల బీరు ఉత్పత్తి అవుతోంది. ప్రతి సంవత్సరం దసరా పండుగ సమయంలో మద్యం అమ్మకాలు భారీగా పెరుగుతాయి. ఈసారి పది రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకు పైగా మద్యాన్ని తెలంగాణ మందుబాబులు తాగేశారు. మద్యం అమ్మకాల్లో ఈసారి కూడా హైదరాబాద్ ముందు నిలిచింది. సెప్టెంబర్ 30 వరకు రూ.2,838 కోట్ల మద్యం అమ్మకాలు జరగగా... అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ రూ.1,100 కోట్ల విలువైన 10 లక్షల 44 వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగాయని ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజుల వ్యవధిలో 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయినట్లుగా తెలుస్తోంది.

# ప్రజాదర్బార్ కు వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

● సిబ్బందికి మంత్రి నారా లోకేష్ ఆదేశాలు ● 43వ రోజు మంత్రి నారా లోకేష్ "ప్రజాదర్బార్" కు తరలివచ్చిన ప్రజలు ● ఆయా సమస్యలపై మంత్రికి విన్నపాలు



**అమరావతి,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** ప్రజాదర్బాకు వచ్చే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సిబ్బందిని ఆదేశించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపడంతో పాటు పరిష్కారం అయ్యేంత వరకు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేష్ 43వ రోజు "ప్రజాదర్బార్" కు మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. తమ సమస్యలను ఏకరవు పెట్టారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**మంగళగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన విజ్ఞప్తులు..** కుమారుడిని హత్య చేసిన వారిని శిక్షించండి – కారు డ్రైవర్ గా పనిచేస్తున్న తన ఏకైక కుమారుడిని తోటి డ్రైవర్లు కలిసి హత్య చేశారని, విచారించి నిందితులను శిక్షించాలని ఉండవల్లికి చెందిన ఏపూరి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి ఆధారమైన కుమారుడిని కోల్పోవడంతో అనారోగ్యానికి గురయ్యాయని, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. – అనారోగ్యంతో భర్త మరణించడంతో తన ఇద్దరి పిల్లల పోషణ భారంగా మారిందని, ఇల్లు మంజూరు చేయడంతో పాటు స్వయం ఉపాధి కల్పించి ఆదుకోవాలని నులకపేటకు చెందిన కొండ సుశీల కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.– అమరావతి రాజధాని పరిధిలో గత 50 ఏళ్లు వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, గత ప్రభుత్వం రాజధాని రైతు కూలీ పెన్షన్ నిలిపివేసిందని, తిరిగి పునరుద్ధరించాలని ఉండవల్లికి చెందిన పెయ్యాల శ్రీరామమూర్తి, భూపతిరాజు సత్యనారాయణ రాజు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.– ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన తమ భూమికి వార్షిక కౌలు అందడం లేదని, విచారించి కౌలు మంజూరుయ్యేలా చర్యలు తీసుకోవాలని నిడమర్రుకు చెందిన చల్లా పెద్ద అంకమరావు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి కౌలు అందేలా చూస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.– బీ.కామ్ కంప్యూటర్స్ చదివిన తనకు ఎయిమ్స్ లో ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగళగిరికి చెందిన షేక్ మహమ్మద్ రఫి కోరారు. పరిశీలించి తగిన ఉద్యోగం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు..** భూమిని ఆక్రమించి జగనన్న కాలనీలకు ఇచ్చారు – తమ కుటుంబానికి వారసత్వంగా సంక్రమించిన 5.48 ఎకరాల అసైన్డ్ భూమిని వైసీపీ నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని.. జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఇచ్చి సొమ్ము చేసుకున్నారని గుంటూరు జిల్లా ఓబులనాయుడు పాలెంకు చెందిన సిద్దెల కిరణ్ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలైన కేశం హరినాథ్, దుగ్గెంపూడి అంజిరెడ్డి, వీఆర్‌ఏ పొత్తూరు పద్మ, పొత్తూరు భాగ్యరాజులు తమను నమ్మించి మోసం చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. నిషేధిత జాబితా నుంచి తమ పొలాన్ని తొలగిస్తామని చెప్పి తమ వద్ద రూ.3 లక్షల నగదు, 50 గ్రాముల బంగారాన్ని లంచంగా తీసుకోవడంతో పాటు అనంతరం మాయమాటలు చెప్పి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సదరు భూమిని జగనన్న కాలనీలకు ఇచ్చి తమకు అన్యాయం చేశారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. – ఇటీవల సంభవించిన వరదల్లో తన ట్యాక్సీ మునిగి పూర్తిగా పాడైపోయిందని, మరమ్మతులకు తగిన ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం హనుమంతపురానికి చెందిన కొడాలి కరుణాకర్ బాబు విజ్ఞప్తి చేశారు. కారుకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నానని వాపోయారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ

# రూ.99 మద్యం షురూ

● సోమవారం నాటికి 20,000 కేసులకు చేరుకోనున్న సరఫరా ● ఈ నెలలో కోటి ఇరవై లక్షల క్వార్టర్ సీసాల మద్యం సిద్ధం



**అమరావతి, అక్టోబరు 17 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా రూ.99లకు క్వార్టర్ బాటిల్ మద్యం అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్ తెలిపారు. మద్యం తయారీ విక్రయాలలో జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు కలిగిన 5 సంస్థలు ఆంధ్రప్రదేశ్ లో ఈ ధరకు మద్యం విక్రయాలు చేసేందుకు సిద్ధం అయ్యాయన్నారు. గురువారం నాటికి పదివేల కేసుల రూ.99 మద్యం మార్కెట్ కు చేరిందని, సోమవారం నాటికి రోజువారీ సరఫరా 20వేల కేసులకు చేరుతుందని వివరించారు. దశల వారిగా సరఫరా పెరిగి ఈ నెలాఖరు నాటికి 2,40,000 కేసుల మద్యం రాష్ట్రంలో అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ క్రమంలో మొత్తంగా కోటి ఇరవై లక్షల క్వార్టర్ సీసాల మద్యం ఈ నెలలో అందుబాటులోకి రానుందన్నారు. వినియోగాన్ని అనుసరించి తదుపరి నెలలలో ఏ మేరకు దిగుమతి చేసుకోవాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని నిషాంత్ కుమార్ వివరించారు.

# మానవ ధర్మాన్ని బోధించిన వాల్మీకి రామాయణం నేటి సమాజానికి అవసరం : హోం మంత్రి వంగలపూడి అనిత

● మంగళగిరి టీడీపీ పార్టీ కార్యాలయంలో వాల్మీకి మహర్షికి నివాళి పలికిన హోం మంత్రి ● వాల్మీకి మహర్షి జయంతిని పండుగగా నిర్వహించడం అభినందనీయం



**అమరావతి,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** మానవ ధర్మాన్ని బోధించిన వాల్మీకి రామాయణం నేటి సమాజానికి అవసరమని హోం మంత్రి వంగల పూడి అనిత వెల్లడించారు. ప్రేమలు, బంధాలు, యుద్ధనీతి, రాజనీతి, సంభాషణ చతురత, జీవితం విలువ, ధర్మాచరణాలెన్నో మనకందించిన రామాయణం అర్థం చేసుకుని ఆచరించే ప్రయత్నం అనివార్య మన్నారు. చిన్నతనం నుంచే చిన్నారు లకు రామాయణం విలువలను నేర్పించడం వల్ల మంచి సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆమె నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

## కుల గణన చేయండి... కానీ పేదవారినందరిని బీసీలు గా గుర్తించండి

**ప్రభుత్వానికి గోగులపాటి కృష్ణమోహన్ ట్విట్టర్ వేదికగా సూచన**



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 17 (వార్తాప్రభ)** : ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టడం హర్షనీయమని నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్విట్టర్ వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి కి ప్రధాన కార్యదర్శి కి ఇతర కెంద్ర, రాష్ట్ర మంత్రులను ట్యాగ్ చేస్తూ కొన్ని సూచనలు చేశారు. 75 సంవత్సరాల క్రితం రాజ్యాంగం రూపొందించబడిందని, అప్పటి పరిస్థితుల ఆధారంగా ఆర్థికంగా మరియు విద్యాపరంగా సగటున ముందున్న కొన్ని కులాలను ఫార్వర్డ్ క్యాస్ట్ గా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలను బ్యాక్ వర్డ్ క్యాస్ట్ (వెనుకబడిన తరగతులు) గా, అస్పృశ్యత, అంటరాని తనంతో అభివృద్ధికి నోచుకోని కులాలను ఎస్సీలుగా, కొండకోనలలో, అడవులలో జీవిస్తున్న ఆటవికులను, గిరి జనులను ముఖ్యంగా సంచార జాతుల వారిని షెడ్యూలు తెగలుగా నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు... వృత్తుల ఆధారంగా ఏర్పడ్డ కులాలు ప్రస్తుతం వృత్తులతో సంబందం లేకుండా జీవితాలు గడుపుతున్నారని, నగరంలో నివసిస్తున్న నేటి తరానికి వారి కులమేంటో, ఆ కులానికి వృత్తేంటో కూడా తెలియని పరిస్థితి ఉందనీ, ఇక కులవృత్తుల మీద ఆధారపడి బ్రతుకుతున్న వారికి కార్పోరేట్ కల్చర్ వలన కులాల కతీతంగా వివిధ రకాల వృత్తులలో రాణిస్తున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం కులాలు రాజకీయ అవసరాలకు, వివాహాది శుభకార్యాలకు తప్ప మరెందుకు ఉపయోగ పడటం లేదన్నది జగమెరిగిన సత్యమనీ, కాబట్టి ఏదైతే రాజ్యాంగంలో సూచించిన ప్రకారం పేదవాడికి న్యాయం జరిగేలా... కులగణనలో భాగంగా కులమతాల కతీతంగా ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఎఫ్. సి. లు, బీసీలు గా గుర్తించి, ప్రభుత్వ ఫలాలు పేదవారికి అందేలా చర్యలు తీసుకోవాలని గోగులపాటి కృష్ణమోహన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా కులాలను తొలగించలేమని కానీ ఈ విధంగా చేస్తే కులాల మధ్య అసమానతలను మాత్రం తొలగించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

## జిల్లా ఆర్టీవో కార్యాలయంలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,కొత్తగూడెం అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**:ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి జి. సదానందం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు చేశారు . ఈ సందర్భంగా శ్రీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం జిల్లా రవాణా శాఖ అధికారి సదానందం మాట్లాడుతూ ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి సప్తఋషుల బోధనల ద్వారా మహర్షి వాల్మీకిగా మారి అద్భుతమైన రామాయణ గ్రంథాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకీ అని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఆదర్శవంతులుగా జీవించి మంచి పేరు తెచ్చుకోవాలని .కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు అనేదానికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యావత్ తెలంగాణ పోరాట యోధుని వైపే!!

- ప్రజా వ్యతిరేక విధానాలపై నిప్పులు చెరుగుతున్న కేటీఆర్
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**యావత్ తెలంగాణ పోరాట యోధులు కెసిఆర్, కేటీఆర్ వైపే నిలుస్తుంది అని అన్నారు రామగుండం మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్. ఈ మేరకు గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని హైదరాబాద్ తెలంగాణ భవన్ లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో చందర్ మాట్లాడుతూ..... ప్రజా వ్యతిరేక విధానాలపై నిప్పులు చెరుగుతున్న కేటీఆర్ తెలంగాణ రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తారని అన్నారు. అలాగే ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న నేపథ్యంలో ప్రజల విశ్వాసం కేసీఆర్, కేటీఆర్ నాయకత్వం, గులాబీ జెండా, కారు గుర్తుపై పెరుగుతున్నది అని తెలిపారు.

## జీఎం కార్యాలయంలో ఘనంగా బడా ఖానా!!

- గుడ్ రిలేషన్, హ్యాపీనెస్ కోసం బడా ఖానా
- సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్
- కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ మహంకాళి స్వామి





**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణి రీజియన్ వన్ జీఎం కార్యాలయంలో గురువారం ఘనంగా బడా ఖానా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ మహంకాళి స్వామి హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వీరు ఇరువురు మాట్లాడుతూ..... సింగరేణి కార్మికుల మధ్య గుడ్ రిలేషన్, హ్యాపీనెస్ కోసం బడా ఖానా కార్యక్రమం చరిత్రలో కనివిని ఎరుగని విధంగా నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు. భోజన సమయంలో సరదాగా మాట్లాడుకుంటూ కష్టసుఖాలు చెప్పుకుంటూ ఒకరినొకరు పలకరించుకోవడం వలన స్నేహం బలపడుతుంది అని తెలిపారు. అనంతరం కార్మికులతో కలిసి భోజనం చేశారు సింగరేణి అధికారులు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, అధికారులు సింగ్, స్వామి, హనుమంతరావు, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## రుడాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎం!!

- దశ దిశ మారనున్న రామగుండం ముఖ చిత్రం
- ఎన్నికల హామీలు నెరవేరుస్తూ సక్సెస్ రుచి చూస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**ఎన్నికల హామీలు నెరవేరుస్తూ సక్సెస్ రుచి చూస్తున్నరు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్. ఇందుకు తాజా నిదర్శనం మరొక హామీ నెరవేరే సమయం ఆసన్నమవడమే. రామగుండం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సమాచారం కాంగ్రెస్ పార్టీ వాట్సాప్ గ్రూపులలో చెక్కర్లు కొడుతున్నది. త్వరలోనే రుడా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు పోస్టుల వరద కొనసాగుతున్నది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రామగుండం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం రుడా ఏర్పాటుకు అంగీకరించినట్లు తెలిసింది. అధికారికంగా రుడా ఏర్పాటు ఉత్తర్వులు వెలువడితే రామగుండం దశ దిశ ముఖచిత్రం మారనుంది. ఎన్నికల హామీని నెరవేర్చబోతున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, పారిశ్రామిక ప్రాంత ప్రజలు అభినందిస్తున్నారు.

## క్యాన్సర్, గుండెపోటు వ్యాధులను తగ్గించడం, భవిష్యత్తులో నిరోధించే లక్ష్యంతో... ఢిల్లీలో 18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్

**-ఆపి అధ్యక్షులు డాక్టర్ సతీష్ కత్తుల**



**హైదరాబాద్ : అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** భారతదేశంలో క్యాన్సర్ వ్యాప్తిని, గుండెపోటు వ్యాధులను తగ్గించే లక్ష్యంగా 18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్ న్యూఢిల్లీలో ఈనెల 18, 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆపి ( అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్) అధ్యక్షులు డాక్టర్ సతీష్ కత్తుల వెల్లడించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న గ్లోబల్ హెల్త్ సమ్మిట్ కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ , కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా, ప్రపంచవ్యాప్తంగా వివిధ వైద్య విభాగాల్లో నిష్ణాతుల్కెన భారతీయ వైద్యనిపుణులు, వైద్య పరిశోధకులు, వందలాది మంది వైద్యవిద్యార్థులు హాజరవుతున్నారన్నారు. గురువారం గురువారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్ లో అకడమిక్ సెషన్స్ ను నిర్వహిస్తున్నామని, ఈ సెషన్స్ లో వైద్యనిపుణులు, పరిశోధకులతో పాటు పాలసీ మేకర్స్ అందరూ హాజరవుతున్నారని వెల్లడించారు. ఈ సదస్సులో ప్రధానంగా అనేక మంది పరిశోధకులు దేశంలో క్యాన్సర్, గుండెపోటు జబ్బులపై జన్యుపరమైన అంశాలు, వాతావరణ పరిస్థితులు ఎలాంటి ప్రభావాన్ని చూపుతున్నాయన్న విషయమై తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తున్నారన్నారు. అదేవిధంగా ఈ వ్యాధులను నిరోధించే చర్యల్లో భాగంగా సరైన వ్యాయామం, సమతుల్యమైన ఆహారంతో కూడిన జీవనశైలిని ప్రజలు అలవర్చుకునేలా చెయ్యడం చాలా ముఖ్యమన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజల జీవనశైలికి అనుగుణంగా ప్రభుత్వాలు విధాన నిర్ణయాలను తీసుకోవడం, కార్యక్రమాలను అమలు చేయడంతో వ్యాధినిరోధక చర్యలు సత్ఫలితాలను సాధిస్తాయన్నారు. అలాగే ఈ సదస్సు ద్వారా అనేక సంస్థల భాగస్వామ్యంతో కమ్యూనిటీ పరంగా సరైన ఆరోగ్య చైతన్యాన్ని తీసుకు వచ్చేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఆపి మీడియా కో ఆర్డినేటర్ బాలకృష్ణ మూర్తి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత ముసుగులో లైంగిక నేరాలు

- ఇషా ఫౌండేషన్ పేరుతో సాగుతున్న అకృత్యాలు
- నిబంధనలను పాటించని ఆశ్రమ నిర్వాహకులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి
- మాజీ ఫ్యాకల్టీ ఆర్. యామిని, ఏపీ, టీఎస్ ఎస్ కమిటీ మెంబర్ ఆర్ సత్య నరేంద్ర



**హైదరాబాద్ : అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** అంతర్జాతీయంగా పేరుగాంచిన ఇషా ఫౌండేషన్ ఆధ్యాత్మికత ముసుగులో విద్యార్థులపై లైంగిక నేరాలకు పాల్పడుతూ అకృత్యాలు చేస్తున్నారని మాజీ ఫ్యాకల్టీ ఆర్. యామిని, ఏపీ, టీఎస్ ఎస్ కమిటీ మెంబర్ ఆర్ సత్య నరేంద్ర ఆరోపించారు. ఆశ్రమ నిర్వాహకులు నిబంధనలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. గురువారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8000 మందికి పైగా విద్యార్థులు ఇషా విద్యా, ఈశా సంస్కృతి, ఇషా హోమ్ స్కూల్ వేర్వేరు పాఠశాలల్లో చదువుతున్నారని వివరించారు. బాలికలపై జరుగుతున్నా నేరాలకు ఇషా ఫౌండేషన్ మేనేజ్మెంట్ , ట్రస్టీ లు, ప్రత్యేకించి వ్యవస్థాపకుడు జగీ వాసుదేవ్ బాధ్యత తీసుకుంటారా ? అని వారు ప్రశ్నించారు. ఈశా కేంద్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల పేరుతో అర్థ నగ్న ప్రదర్శనలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పిల్లలు చనిపోయినా ఈ విషయాలను దాచిపెట్టి, స్కూల్ లో 8 సంవత్సరాల బాలిక అత్యాచారానికి గురైనా బయటకు రాకుండా దాచిపెట్టారని చెప్పారు. అలాగే 3 సంవత్సరాల వ్యవధిలో 13 ఏళ్ళ బాలుడు వేధింపులకు గురయ్యాడని వివరించారు. సద్గురు స్థాపకుడు తాను సాక్షాత్కారమైన ఆత్మ అని, కరుణతో నిండి వున్నానని చెప్పుకుంటూ ఇషా విద్యా, ఈశా సంస్కృతి, ఇషా హోమ్ స్కూల్లో విద్యార్థులపై జరుగుతున్న అకృత్యాలపై నోరు విప్పడం లేదని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవమైన 2024 జూన్ 21న 12వ తరగతి చదువుతున్న 16 సంవత్సరాల బాలుడు మరణించిన విషయాన్ని కూడా గోప్యంగా ఉంచారని తెలిపారు. నిబంధనలు పాటించకుండా మానవ శ్రేయస్సు ముసుగులో ఇషా ఫౌండేషన్ వారు చేస్తున్న ఈ అకృత్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఘనంగా బండారు మోహన్ ముదిరాజ్ ఎమ్మెల్యే వేడుక



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 17 (వార్తాప్రభ)** :కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారు మోహన్ ముదిరాజ్ జన్మదినం సందర్భంగా అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎం.డి.అన్వర్ షరీఫ్,మహేందర్ ముదిరాజ్, గంగాధర్,శ్రీను ముదిరాజ్,చిరంజీవి ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు

# హైదరాబాద్

## మహా అన్నదానం లో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం, విజయదశమి సందర్భంగా పోస్ట్ ఆఫీస్ సెంటర్ ఆటో ఓనర్స్, డ్రైవర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో నిర్వాహకుల ఆహ్వానం మేరకు టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దేవి నవరాత్రుల సందర్భంగా పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి ఘనంగా పూజలుచేశారు సుమారు 2 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేసిన నిర్వాహక కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. అమ్మ దయ అందరికి ఉండాలని, అంతా మంచే జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ పట్టణ అధ్యక్షులు జయప్రకాష్, బొబ్బల వెంకట్ యాదవ్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కుమార్ యాదవ్



**కూకట్ పల్లి,అక్టోబర్17: (వార్తప్రభ):** కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీ లోనీ రెడ్డి ఫంక్షన్ హాల్ లో బుధవారం సిద్ధం పాండు భూదేవి కుమార్తె వివాహం వరుడు శంకర్ తో ఘనంగా జరిగింది.ఈ వివాహ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ పై బిజెపి జండా ఎగరటం ఖాయం-బిజెపి నేత రవికుమార్ యాదవ్




**శేరిలింగంపల్లి,అక్టోబర్ 17 (వార్తాప్రభ)**:చందానగర్ పిజిఆర్ స్టేడియం వద్ద బీజేవైఎం నాయకులు ఫిరంగి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన భారతీయ జనతా పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి రవికుమార్ యాదవ్ పాల్గొని అక్కడ ఉన్నటువంటి స్థానికులకు సభ్యత్వాలు చేయించి నియోజకవర్గం ముఖ్య నాయకులు విధిగా 500 వందలకు మించకుండా సభ్యత్వ నమోదు చేపట్టాలని, రాష్ట్రంలోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం నమోదు కార్యక్రమంలో ముందు వరుసలో ఉంచాలని కోరారు.నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి రోజురోజుకీ ఆదరణ పెరిగి స్వచ్ఛందంగా ప్రజలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టడానికి ముందుకు వస్తున్నారని రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని రవి కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి,శ్రీనివాసరెడ్డి,శాంతి భూషణ్ రెడ్డి,రాజు సుధాకర్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సీ.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 17 (వార్తాప్రభ)**:భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎం.ఐ.జి కాలనీ కి చెందిన శ్రీ సాయి నాథ్ కి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన 18,000/- పద్దెనిమిది వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి అందచేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అనిప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పీఏసీ చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు.అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని,అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు,అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. పీఏసీ చైర్మన్ గాంధీ ఈ సందర్భంగా తెలియచేశారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్,అనిల్ రెడ్డి,పోతులరాజేందర్,కాశినాథ్ యాదవ్,క్రాంతి,మంజుల, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## ఎన్డీయే కన్వీనర్ గా చంద్రబాబు ?

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏపీ వైపు చూస్తోంది. ఏపీ నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అతి ముఖ్య మద్దతుదారులుగా ఉన్నారు. ఈ ఇద్దరి పార్టీల నుంచి మొత్తం 18 ఎంపీ సీట్లు కేంద్రంలోని ఎన్డీయే ప్రాణప్రదంగా మారాయి. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా చంద్రబాబుకు పవన్ కి ఎన్డీయేలో ఎంతో ప్రాధాన్యత లభిస్తోంది. ఇదిలా ఉంటే హర్యానా ముఖ్యమంత్రిగా నయాబ్ సింగ్ సైనీ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి చంద్రబాబు పవన్ లకు ఆహ్వానం అందింది. దాంతో ఈ ఇద్దరూ ప్రత్యేక విమానంలో బయలుదేరి చండీఘర్ చేరుకున్నారు. ఈ ప్రమాణంలో ఈ ఇద్దరు నేతలు ఆకర్షణగా నిలిచారు ఇక ఈ సమావేశం తరువాత ఎన్డీయే పక్షాలతో కలసి కీలకమైన సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చంద్రబాబు పవన్ మిత్ర పక్షాలుగా పాల్గొంటారు. ఈ ఇద్దరితో పాటు ఇతర ఎన్డీయే పక్షాలు కూడా పాలు పంచుకుంటాయి. ఈ సందర్భంగా జమిలి ఎన్నికలు దేశంలో నిర్వహించడమే అజెండాగా చేసుకుంటారని తెలుస్తోంది. జమిలి ఎన్నికలకు బీజేపీ గట్టి పట్టుదలగా ఉంది. దాని మీదనే సీరియస్ గా చర్చిస్తారు అని అంటున్నారు. మూడో విడత కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే పాలన గురించి ప్రధాని మిత్రపక్షాలకు వివరిస్తారని అంటున్నారు అంతే కాదు జమిలి ఎన్నికల ఆవశ్యకత గురించి కూడా ఈ సమావేశంలో వివరించి మిత్రుల నుంచి ఆమోదం తీసుకుంటారని తెలుస్తోంది. అంతే కాదు మరో ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. ఈ సమావేశాలోనే ఎన్డీయే కన్వీనర్ గా కీలకమైన పదవిని చంద్రబాబుకు ఇస్తారు అని అంటున్నారు. చాలా కాలంగా ఇది ప్రచారంలో ఉన్నా ఈసారి ఇది జరిగి తీరుతుందని అంటున్నారు. చంద్రబాబు విషయానికి వస్తే గాయనకు ఈ పదవి కొత్త కాదు గతంలో వాజ్ పేయి టైం లో ఆయన ఈ పదవిని చేపట్టారు. ఇపుడు మరోసారి బాబు ఎన్డీయే పక్షాన జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషిసారు అని అంటున్నారు. ఈ మేరకు బాబుని పూర్తిగా విశ్వాసంలోకి తీసుకుని ఆయనకు ఎండీయే కన్వీనర్ కిరీటం తొడగాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారని టాక్. దీంతో చంద్రబాబు ద్వారా జమిలి ఎన్నికల్తో పాటు బీజేపీ అజెండాని స్మూత్ గా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నెరవేర్చుకునే ప్రయత్నం ఒకటి జరుగుతుందని అంటున్నారు. ఇక చండీఘర్ వెళ్ళిన చంద్రబాబుకు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పక్క సీటు ఇచ్చి మరీ గౌరవించారు. మరో వైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అలాగే కేంద్రంలో కీలక మంత్రిగా ఉన్న నితిన్ గడ్కరీ ఇంకో కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ బాబుతో అప్యాయంగా మాట్లాడం జరిగింది. ఇక బాబుని రిసీవ్ చేసుకోవడమే చాలా గొప్పగా జరిగింది. మొత్తానికి బీజేపీ పెద్దలు తమకు చంద్రబాబు కొండంత అండ అని భావిస్తున్నారు. అందుకే బాబుకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు అని అంటున్నారు. బాబు సైతం కేంద్ర బీజేపీ పెద్దల వద్ద తన పెద్దరికం నిలబెట్టుకుంటూ జాతీయ రాజకీయాల్లో తగిన విధంగా తన పాత్రను నిర్వహిస్తున్నారు అని అంటున్నారు. మొత్తం మీద ఎన్డీయే సమావేశంలో టీడీపీ అధినాయకుడు చంద్రబాబే హైలెట్ గా ఉండడం విశేషంగా చెప్పుకోవచ్చు

## ఠాగూర్ గ్రంథాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి




**విజయవాడ, అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**ఠాగూర్ గ్రంథాలయం నందు ఈరోజు వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కే రమాదేవి మాట్లాడుతూ వాల్మీకం అంటే పుట్ట నుంచి వచ్చిన వాడే వాల్మీకి అయ్యాడు. బోయవానిగా జన్మించి మహర్షి గా పరివర్తన చెందిన రత్నాకరుడు. రామాయణాన్ని రచించి శ్రీ రాముడిని లోకోత్తర పురుషునిగా చిత్రీకరించిన మహర్షి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వై. ధనలక్ష్మి, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థ కార్యాలయంలో మహర్షి వాల్మీకి ఘన నివాళులు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో గురువారం ఉదయం మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర వాల్మీకి జయంతి సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ వాల్మీకి రామాయణంగా పేరు గాంచిన వాల్మీకి మహర్షిని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం ఎంతైనా అవసరం ఉందని, ఈ తరం విద్యార్థిని, విద్యార్థులకు మరియు ప్రతి ఒక్కరికి నాటి మహర్షి వాల్మీకి లాంటి గొప్ప వ్యక్తులను వారు చేసిన పనులను తెలియజేయడం అవసరమని తెలియజేశారు. ఈ వేడుకలలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ ఈ (ప్రాజెక్ట్స్) సత్యకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపడమే విజయ దీపం లక్ష్యం

విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి







**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నేటితరం విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చి వారి జీవితాలలో వెలుగులు నింపడానికి సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. సుజన ఫౌండేషన్ మరియు క్రిస్ప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ లు అంగన్వాడీలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో గురువారం ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్లో విజయ దీపం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి) సుజనా ఫౌండేషన్ సీఈవో పివి రావ్ , సుజనా ఫౌండేషన్ సలహాదారు వి శ్రీనివాసరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారులు క్రిస్ప్ ఫౌండర్ కన్నెగంటి సంధ్యారాణి, వేణుగోపాల్ రెడ్డి,బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ పది మంది విశ్రాంత ఐఏఎస్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్వాడీ లు, పాఠశాలల్లోని బాల బాలికలు, టీచర్లు, అందరి అవసరాలకు అనుగుణంగా సరికొత్త విద్యా విధానానికి రూప కల్పన చేశారన్నారు. విద్యార్థుల శక్తి, సామర్థ్యాలను వెలికి తీసి వారికి ఇష్టమైన రంగాల్లో, రాణించేలా ప్రోత్సహించడం తద్వారా వారి జీవన జీవన నైపుణ్యాలను మెరుగుపరిచి వారికి ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా సుజాన ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థలు కృషి చేస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్లో మొదటిసారిగా పశ్చిమ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా చేపడుతున్న విజయ దీపం కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆకాంక్షించారు. ఈ విజయ దీపం కార్యక్రమం ద్వారా ప్రైమరీ పాఠశాల, హై స్కూల్ విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించి వారిలోని ప్రతిభా పాటవాలను గుర్తించి వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉపాధి అవకాశాల కల్పనె ధ్యేయంగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారికి ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకునేలా ప్రోత్సహించడం, వ్యాపార అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు. ప్రధాని మోడి పదేళ్ల పాలనలో 35 కోట్ల మంది పేదలు దారిద్ర్య రేఖ నుంచి బయటికి వచ్చారన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా కూడా ప్రజలు అనేక చోట్ల దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సేవల కృషి తో పాటూ ప్రజల సహకారం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించొచ్చు అన్నారు. సమిష్టిగా విజయ దీపం కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రంలో, దేశంలో పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని సుజనా చౌదరి హామీ ఇచ్చారు.

# మందాకృష్ణ మాదిగ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మహాసేన రాజేష్ పై తెలుగుదేశం పార్టీ పెద్దలకు ఫిర్యాదు

### తెలుగుదేశం పార్టీ పెద్దలకు అందించిన పిర్యాదు యధాతథంగా....



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహారాజశ్రీ గౌరవనీయులు రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి తెలుగుదేశం పార్టీ మాదిగ నాయకులు కార్యకర్తలు వ్రాసుకున్న విన్నపము,అయ్యా!మేమంతా తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం నుండి వివిధ హెూదాలలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి పని చేస్తూ ఉన్నాము, మొన్న 2024 లో జరిగిన సాధారణ ఎన్నికలలో కూటమి గెలుపులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కీలకపాత్ర పోషించారనేది జగమెరిగిన సత్యం. ఆయన పిలుపుమేరకు రాష్ట్రంలోని మాదిగ సమాజమంతా కూటమి వైపు నిలబడి కష్టపడి పని చేసి మరి ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ వైపు వెళ్లడం కూడా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేస్తానని ఎన్నికలలో హామీ ఇవ్వడమే కాకుండా మేనిఫెస్టోలో కూడా పెట్టడం జరిగింది, ఇదే క్రమంలో గౌరవ సుప్రీంకోర్టు వారు కూడా ఎస్సీ వర్గీకరణ సమర్థనీయమే ప్రతి రాష్ట్రం కూడా ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి వర్గీకరించుకోవచ్చు అని తీర్పును ఇవ్వడం జరిగింది. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన నాటి నుండి తెలుగుదేశం పార్టీలో అధికార ప్రతినిధిగా ఉన్న మహాసేన రాజేష్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పై సోషల్ మీడియా వేదికగా అనేకసార్లు అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా మాదిగ సమాజాన్ని కూడా కించపడడం జరిగింది. అయితే మహాసేన రాజేష్ తెలుగుదేశం పార్టీలో అధికార ప్రతినిధిగా ఉంటూ, ఈ నెల 12 న అంబేద్కర్ భవన్, కాకినాడలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ఆ సమావేశం వేదికగా అత్యంత జుగుప్సాకరంగా మందకృష్ణ మాదిగని బూతులు తిట్టడం, అవమానించడం, కించపరచడం జరిగింది. ఈ మహాసేన రాజేష్ గతంలో కూడా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని కూడా ఓడిస్తానని బహిరంగంగా చెప్పడం కూడా జరిగింది, కూటమి గెలుపులో ప్రధాన పాత్ర పోషించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ని పొత్తు ధర్మాన్ని మరచి తన ఇష్టం వచ్చినట్లు అభ్యంతరకరమైన భాషతో తిట్టడం, ప్రశాంతంగా ఉన్న సమాజంలో కులాల మధ్య చిచ్చు పెట్టడం పార్టీల మధ్య గొడవలు సృష్టించడమే అతని ప్రధాన ఎజెండాగా అనిపిస్తుంది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ని ఇంత దారుణంగా తిట్టినందువల్ల రాష్ట్రంలోని మాదిగ సమాజమంతా బాధపడుతుంది అలాగే తెలుగుదేశం పార్టీలో ఉన్న మాదిగల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి, ఇది ఇలానే కొనసాగితే ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అనేక ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తుంది, తెలుగుదేశం పార్టీ, మాల సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డోల బాల వీరాంజనేయ స్వామి మరియు పొలిట్ బ్యూరో సభ్యులు వేమూరు శాసనసభ్యులు నక్క ఆనంద్ బాబు, తెలుగుదేశం పార్టీ పట్ల నారా చంద్రబాబు నాయుడు పట్ల అత్యంత విధేయత కనబరుస్తూ పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎంతో క్రమశిక్షణతో ఉంటారు, అందుకే వారంటే మాకు కూడా చాలా గౌరవం, కానీ మహాసేన రాజేష్ ఇలాంటి రెచ్చగొట్టి, సమాజంలో అలజడి సృష్టించే విధంగా ప్రవర్తించడం చాలా ఆక్షేపణీయం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్రమశిక్షణగా ఉండాలని మనకు నిత్యం చెబుతూ ఉంటారు ఆయన ఆదేశానుసారం మాత్రమే మేము మౌనంగా ఉండాల్సి వస్తుంది, తెలుగుదేశం పార్టీలో అధికార ప్రతినిధిగా ఉంటూ కులాల మధ్య పార్టీల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్న మహాసేన రాజేష్ పై పార్టీ పరంగా చర్యలు తీసుకొనగలరని కోరుకుంటున్నామని తెలుగుదేశం పార్టీ మాదిగలు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వైపు ట్రాఫిక్ పోలీసుల అడుగులు

### తొలిసారిగా వన్ ట్రాఫిక్ పోలీసులు డ్రోన్ కెమెరాలతో ట్రాఫిక్ రద్దీ గుర్తింపు

**విజయవాడ పశ్చిమఅక్టోబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ సిటీ లో రాను రాను పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రణ చేయడానికి నగర ట్రాఫిక్ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వైపు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం వన్ ట్రాఫిక్ పోలీసులు డ్రోన్ కెమెరాను ప్రయోగాత్మకంగా ట్రాఫిక్ రద్దీని గుర్తించే చర్యలు చేపట్టారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ డిసిపి కృష్ణమూర్తి పర్యవేక్షణలో ట్రాఫిక్ ఏ డి సి పి ప్రసన్నకుమార్ ఆదేశాల మేరకు వన్ ట్రాఫిక్ ఏసిపి పి రామచంద్రరావు ఆధ్వర్యంలో విజయవాడ వన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రకాశం బ్యారేజీ, మరియు పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా ద్వారా ఎక్కడెక్కడ ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నది , తక్కువ గా ఉన్నదో ఈ యొక్క డ్రోన్ కెమెరా ద్వారా వన్ ట్రాఫిక్ సి ఐ ఏ ఉమామహేశ్వరరావు తన సిబ్బందితో పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం తగు చర్యలు చేపట్టడానికి వీలుగా సదరు డ్రోన్ కెమెరా యొక్క టెక్నాలజీని వినియోగించారు. ఈ కార్యక్రమంలో కమాండ్ కంట్రోల్ డ్రోన్ కెమెరా ఆపరేటర్ కానిస్టేబుల్ మహేంద్ర, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుల్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## అనాధ పిల్లలకు ఆధార్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలి - జిల్లా కలెక్టర్!!!



**మచిలీపట్నం అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలను గుర్తించి వారికి ఆధార కార్డులు, ఆర్ఫన్(అనాధ) సర్టిఫికెట్ల జారీకి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం ఆయన పెనమలూరు మండలం కానూరులోని జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పిల్లల సంరక్షణ సంస్థలు, బాల్యవివాహాలు, పిల్లల లైంగిక వేధింపులు, బాల కార్మికులు, పిల్లల సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల సంరక్షణ సంస్థల్లో (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్) రక్షణ పొందుతున్న పిల్లలందరూ చట్టం పరిధిలోకి రావాల్సిందేనని, దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం నిర్వహిస్తూ పిల్లల సంరక్షణ సంస్థల్లో ఉంటున్న వారికి సరియైన సదుపాయాలు లేకుండా పిల్లలను ఉంచుకుంటూ, వారికి రక్షణ సంరక్షణ కల్పించకుండా ఉన్న ఆయా సంస్థల నుండి పిల్లలను తీసుకువచ్చి అన్ని వసతులు ఉన్న ఇతర పిల్లల సంరక్షణ సంస్థలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిల్లల పోషణ స్థితిని సక్రమంగా పర్యవేక్షిస్తూ గృహ సందర్శనలు నిర్వహించాలని సిడిపిఓలు, సూపర్వైజర్లకు కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ ఎస్ సువర్ణ, సిడిపిఓలు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## బోరంపల్లి గ్రామ పొలిమేరల్లో చిరుతపులి సంచారం

**కళ్యాణదుర్గం: అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామ పొలిమేరలో చిరుతపులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం బొలెరో వాహనంలో గంగవరం అరటి తోటకు వెళుతున్న కూలీలు గమనించి గ్రామస్థులకు ఈ విషయం చెప్పారు. చిరుతపులి బోరంపల్లి నుంచి గంగవరం గ్రామం వైపు వెళుతున్నట్లుగా గమనించినట్లు వారు తెలిపారు

## పామూరు పంచాయతీ కార్యదర్శి జీవి అరవిందను మర్యాదపూర్వకంగా కలిసిన గౌస్ బాషా



**కనిగిరి అక్టోబర్ 17 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం పామూరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జీవీ అరవింద ను గురువారం పామూరు పట్టణ టిడిపి ఫోర్ మెన్ కమిటీ సభ్యులు షేక్ గౌస్ బాషా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పామూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బ్రహ్మారెడ్డి సి ఎస్ పురం పంచాయితీకి బదిలీ కాగా కనిగిరి మండలం చల్లగిరిగిల పంచాయతీ కార్యదర్శి అయిన అరవింద పామూరు మేజర్ పంచాయతీకి బదిలీపై వచ్చారు. పంచాయితీలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇటీవల ఇంటి కొళాయిల నీటి విడుదలపై కొంత జాప్యం జరుగుతుందని షేక్ గౌస్ బాషా పంచాయతీ కార్యదర్శి జీవి అరవింద దృష్టికి తీసుకెళ్లారు. పంచాయితీ సమస్యలను సత్వరమే పరిష్కారం చేస్తామని గౌస్ భాషా కు పంచాయతీ కార్యదర్శి అరవింద హామీ ఇచ్చారు.

## మోదు బోయిన వారి వివాహ వేడుకల్లో దారపనేని



**కనిగిరి అక్టోబర్ 17 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య సోదరుడు చెనికల మాధవరావు, సతీమణి జయమ్మ దంపతుల కుమార్తె లక్ష్మీ సౌభాగ్యవతి అన్నపూర్ణ, ఒంగోలు పట్టణ వాస్తవ్యులు మోదుబోయిన లక్ష్మీనారాయణ సతీమణి ప్రభావతి దంపతుల కుమారుడు చిరంజీవి మనోజ్ కుమార్ ల వివాహ వేడుకలు బుధవారం రాత్రి ఒంగోలు పట్టణంలోని బచ్చుల బాలయ్య కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో చెనికల వారి ఆప్తమిత్రులు, శ్రేయోభిలాషి అయినటువంటి కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి వివాహ శు భాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో ఒంగోలు టిడిపి నాయకులు వై వి సుబ్బారావు,తూర్పు కోడిగుడ్లపాడు మాజీ సర్పంచ్ దారపనేని జనార్దన్ రావు, రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి మోరుబోయిన గంగరాజు యాదవ్, చెనికల పెదమాల కొండయ్య, చిన్న మాల కొండయ్య,కృష్ణ,దారపనేని దేవరింటీ కృష్ణ, మిరియం సుబ్బరాయుడు , మానం మల్లికార్జునరావు, సుబ్బరాయుడునూతల పాటి వెంకటేశ్వర్లు అండ్ బ్రదర్ ,చెనికల మాల కొండయ్య (పెద్దాయన) నాగేశ్వరరావు, రమణ, శ్రీనివాసులు, బొడ్డు వెంకటేశ్వరరావు అండ్ బ్రదర్స్ , చెనికల వారి కుటుంబ సభ్యులు, మోదు బోయిన వారి కుటుంబ సభ్యులు పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

## వరద బాధితులకు రామ్ కో ఇండస్ట్రీస్ సాయం



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 17(వార్తా ప్రభ ప్రతినిధి):-** ఇటీవల సంభవించిన వరద వలన పశ్చిమ ఇబ్రహీంపట్నంలో పలు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ వంతు సామాజిక బాధ్యతగా రాంకో ఇండస్ట్రీస్ వారు వరద బాధితులకు సాయం అందజేశారు. సుమారు 200 కుటుంబాలకు నిత్యవసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంకో ఇండస్ట్రీస్ మేనేజర్ పి ఆనందరావు మాట్లాడుతూ కష్టకాలంలో స్థానిక ప్రజలకు అండగా నిలవాలని తమ వంతు సాయంగా నిత్యవసర సరుకులు అందజేశామని తెలిపారు. మొదటి విడతగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా సుమారు 600 లకు పైగా కుటుంబాలకు నిత్య సరుకులు అందజేశామని, రెండో విడుదల భాగంగా గురువారం నాడు 200 కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రావి ఫణి, జల్లి కాంతారావు, రాంకో ఇండస్ట్రీస్ హెచ్ ఆర్ మేనేజర్ టీజీ రామ్మోహన్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన విద్యుత్ ఏఈ లిఖితేష్ రెడ్డి



**చేజర్ల అక్టోబర్ 17 (వార్తాప్రభ)** మండలంలో గురువారం లిఖితేష్ రెడ్డి మండల విద్యుత్ శాఖ ఏఈ గా నూతన బా ధ్య తలు స్వీకరిం చారు .ఆయన మాట్లాడుతూ మం డలంలో ని ప్రజలందరూ సకాలంలో విద్యుత్ బకాయిలు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు. విద్యుత్ సమస్యలపై వెంటనే తమకు సమాచారం అందిస్తే వాటిని సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. వర్షాకాలం సీజన్ కావడంతో ప్రజలు ఎవరు కూడా తడి చేతులతో విద్యుత్ స్తంభాలు మరియు విద్యుత్ తీగలను తాకరాదని తెలిపారు. ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరు విద్యుత్తు వైర్లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.

# రాష్ట్ర ఎక్సైజ్ మరియు గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన రాష్ట్ర సాగునీటి సంఘాల సారధులు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ఎక్సైజ్ మరియు గనుల శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్రగారిని మచిలీపట్నంలోని ఆయన కార్యాలయంలో ఈరోజు సాయంత్రం సాగునీటి వినియోగదారులసంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి, రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శివేములపల్లి శ్రీనివాసరావు తదితరులు కలిసి పూలమొక్క అందజేసి దుశ్శాలువతో ఘనంగాసత్కరించారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ 2014-2019లో నీరు-చెట్టు కార్యక్రమంలో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పారదర్శకంగారాష్ట్రవ్యాప్తంగా చెరువులు పూడికతీత, చెక్ డ్యాంల నిర్మాణం, కాలువల పూడికతీత, పంటకుంటలనిర్మాణం తదితర 28వేల పనులను రు.1,707 కోట్లతో పనులు పూర్తిచేయటం జరిగిందని, అందులో రు.1303 కోట్లకు సంబంధించి సి.ఎఫ్.ఎం.ఎస్. టోకెన్ పడిన తరువాత కూడా2019-2024 లో గత వై.సి.పి. ప్రభుత్వం కక్షపూరితంగా బిల్లులు పెండింగ్లో పెట్టగా అప్పటితెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుగారి దశ దిశ నిర్దేశంతోఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి పనులు చేసిన రైతుల తరఫున 9391 రిట్పిటిషన్లు, 6625ధిక్కార పిటిషన్లు గత వై.సి.పి. ప్రభుత్వంపై బిల్లులు చెల్లించమని కోరగా రాష్ట్ర హైకోర్టుఆదేశాలమేరకు విధిలేని పరిస్థితుల్లో ప్రస్తుత ఎన్.డి.ఎ. ప్రభుత్వం వచ్చేనాటికి రు.968 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయటం జరిగిందని ఎన్.డి.ఎ. ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికికోర్టు కేసులకు సంబంధించి రు.427 కోట్లు పెండింగులో వుండగా ప్రస్తుత ప్రభుత్వం ఆర్థికఇబ్బందులు ఉన్నప్పటికి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ లో రు.256 కోట్లు కేటాయించి రైతుల ఖాతాల్లోజమచేయటం జరిగిందని దాంట్లో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో రు.60 కోట్లు నీరు - చెట్టుకుసంబంధించి బిల్లులు పెండింగ్లో వుండగా ఇప్పటి వరకు రు.50 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయటం జరిగిందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువచ్చినట్లు "ఆళ్ళ" తెలిపారు.దీనిపై మంత్రి కొల్లు రవీంద్ర స్పందిస్తూ ఎంతో శ్రమించి రైతుల తరఫున పోరాటం చేసి నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు రైతుల ఖాతాల్లో జమచేసినందుకు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావుకునీరు-చెట్టు పెండింగ్ బిల్లుల ఫిర్యాదుల విభాగం సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ టి.డి.పి. ప్రచార కార్యదర్శి పి.వి.ఫణికుమార్ తదితరులుపాల్గొన్నారు.

## దెబ్బతిన్న వరిని పరిశీలించిన అధికారులు



**చేజర్ల అక్టోబర్ 17 (వార్తాప్రభ)** మండలంలోని తూర్పు ఖమ్మంపాడు కోటితీర్థం గ్రామాల్లో వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను ఆత్మకూరు పిడి శివ న్నారాయణ కేవికే కోఆర్డినేటర్ శివజ్యోతి సైంటిస్ట్ సురేఖ నాయక్ లు పరిశీలించారు.రైతులకు తగు సూచనలు చేశారు.50 గ్రాములు గల్ల ఉప్పు ద్రావణాన్ని లీటర్ నీటితో కలిపి వరికి పిచికారి చేయాలని సూచించారు.వారితో పాటు మండల వ్యవసాయ శాఖ అధికారి శశిధర్ మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.

## లోతట్టు జలమయ ప్రాంతాలు పరిశీలన

● ఆత్మకూరు డిఎస్పి వేణుగోపాల్



**కలువాయి అక్టోబర్ 17 (వార్తాప్రభ)** మండల చెరువు వెంకటరెడ్డి పల్లి రాజుపాళెం లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్ జిల్లాలో గత మూడు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి.మండల పరిదిలోని కలువాయి చెరువు వెంకటరెడ్డి పల్లి రాజుపాళెం గ్రామాలలో నీటి ప్రవాహం అధికంగా వున్న ప్రాంతాలలో ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లపై నీరు పొర్లి ప్రవహించే మార్గములో రాకపోకలు సాగించేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు సమన్వయంతో వర్షాలకి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలువాయి ఎస్ ఐ సుమన్ మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి మీద రెండు లక్షల అప్పు.

● అందుకు కారణం కెసిఆర్ పాలన కాదా..?- డా.సత్యం శ్రీరంగం




**కూకట్ పల్లి,అక్టోబర్17 (వార్తప్రభ):**రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల కాలంలో యెనభై వేల కోట్ల రూపాయల అప్పులు చేసారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ తొమ్మిది నెలల్లోనే ఎనభై వేల కోట్ల రూపాయల అప్పులు చేసారని ఈ రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుందన్నారు. పదేళ్లు ఈ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని అవినీతి కేసీఆర్ ప్రభుత్వం చేసిందని, పదేళ్ల క్రితం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయినపుడు మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల పై చిలుకు అప్పులు చేసి ఈరోజు ప్రతి వ్యక్తి మీద 2లక్షల అప్పుకు కారణం మీరు కాదా అని ప్రశ్నించారు. మా ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక అరవై తొమ్మిది వేల కోట్లు అప్పు అయితే దాంట్లో యాభై వేల కోట్లు దాదాపుగా మీ గత ప్రభుత్వ అప్పుల వడ్డీలు కట్టేందుకే సరిపోయిందని, అందులో ఇరవై వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామని, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేసేది మీ కళ్ళకు కనపడుతుంటే అసలు ఆ మాటలు అనడానికి మీకు నోరెలా వచ్చిందని అన్నారు. హైదరాబాద్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లుగా నటిస్తూ అనేక అక్రమాలకు తెరలేపింది, అక్రమ జీవోలతో బిల్డర్స్ కి ఎక్కువ ఎస్ఎఫ్టి కి ఇచ్చి అక్రమాలకు పాల్పడింది, మూసి ప్రక్షాళన మొదలు పెట్టింది మీరు కాదా కేటీఆర్ అని ప్రశ్నించారు. అప్పుకు కాదు ఏది అనర్థం అన్నట్లుగా ప్రతి దాని మీద అప్పుల కుప్పగా ఈ రాష్ట్రాన్ని తాయారుచేసారు. మీరు చేసిన పాపాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కడిగే ప్రయత్నం చేస్తుంటే ప్రశ్నించే నైతిక హక్కు మీకు ఎక్కడిదని ప్రశ్నించారు.

## గుంటలనైనా పూడ్చండి మహాప్రభో



**కలువాయి అక్టోబర్ 17 (వార్తాప్రభ)** జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కలువాయి మండలంలోని కుల్లూరు చెరువు కు అధికంగా వరద నీరు చేరటం వలన చెరువులో నీరు పొంగి పొర్లి వెంకటరెడ్డిపల్లి గ్రామంలో ప్రధాన రహదారి వైపు ప్రవహించడంతో వాహన దారుల రాకపోకలకు ఈ మార్గము అసౌకర్యవంతంగా మారింది.ఇప్పటికే రోడ్డుపై నీరు చేరి గుంటలు కనిపించక ద్విచక్ర వాహనదారులు పడ్డట్టుగా గ్రామస్థులు తెలుపుతున్నారు. వెంకయ్య స్వామి గుడిప్రక్కన చాలా రోజులుగా పడివున్న గుంటలను అధికారులు పట్టించుకొని కనీసం గుంటలను పూడిస్తే బాగుంటుందని ఆ గ్రామ ప్రజలు అభిప్రాయపడ్డారు.

## మూసీ పునరుజ్జీవనం కోసం.....సియోల్ స్టడీ టూర్ కు ప్రజా ప్రతినిధులు, అధికారుల బృందం

- ఈ నెల 21 వ తేదీ నుంచి 24 వ తేదీ వరకూ సియోల్ లో పర్యటన
- మూసి పునరుజ్జీవనం దిశగా మరో కీలక ముందడుగు

**హైదరాబాద్, అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**మురికికూపంగా మారిన మూసీనీప్రక్షాళనతో నదికి పూర్వ వైభవం తేవడం, హైదరాబాద్ ను గొప్ప హెరిటేజ్ నగరంగా తీర్చిదిద్దడం , స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, ఉపాధి కల్పన, ఆదాయ మార్గాలు అభివృద్ధి చేయడం కంకణం కట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం...ఆ దిశగా మరో కీలక ముందడుగు వేసింది.మూసీ పునరుజ్జీవనం కోసం మంత్రులు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ అధికారులతో కూడిన బృందం ఈ నెల 21 వ తేదీ నుంచి 24 వ తేదీ వరకూ దక్షిణ కొరియాలోని సియోల్ నగరాన్ని సందర్శించనుంది.సియోల్ లో రివర్ ఫ్రంట్ అభివృద్ధికి బృంద సభ్యులు క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నారు.ఇందుకోసం బృంద సభ్యులు ఈ నెల 20 వ తేదీ వేకువ జామున హైదరాబాద్ నుండి దక్షిణ కొరియాకు బయలు దేరనున్నారు.తిరిగి ఈ నెల 25 వ తేదీన హైదరాబాద్ కు చేరుకుంటారు.

## అబ్కారీ భవన్‌లో వాల్మీకి జయంతి ఉత్సవాలు..

వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు



**అమరావతి అక్టోబర్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)** తొలి సంస్కృత కవిగా పిలువబ డే వాల్మీక మహాకవి తెలియనివారెవరు ఉండరనిఎక్సైజ్ అడిషనర్ కమిషనర్ ఆజేయ్‌రావు అన్నారు. గురువారం అబ్కారీ భవన్‌లో పూర్ణిమ సందర్భంగా ఆక్టోబ రు 17న వాల్మీకి జయంతి ఉత్సవాలు జరుపుకుంటారు.ప్రభుత్వం అధికారికంగా వాల్మీకి జయంతి ఉత్సవాలను నిర్వహించాలనే అదేశాల మేరకు కార్యాలయంలో పని చేసే అధికారులు, సిబ్బంది వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు అందరు పాల్గన్నారు. అజయ్‌రావుతోపాటు రంగారెడ్డి డిప్యూటి కమిషనర్ దశరథ్, రంగారెడ్డి, హైదరాబాద్ అసిస్టేంట్ కమిషనర్లు ఆర్. కిషన్, అనిల్ కుమార్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గన్నారు.

## అప్పారావు జీవితం స్ఫూర్తిదాయకం

'సామాన్యుడు' పుస్తకావిష్కరణ సభలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు టీడీ.జనార్ధన్



**విజయవాడ, అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**సమాజ సేవా పరమావధిగా తన జీవితాన్ని అంకితం చేసిన సేవాతత్పరుడు మన్నేపల్లి అప్పారావు జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకం అని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్ అన్నారు. మన్నేపల్లి అప్పారావు సేవా జీవితాన్ని క్రోడీకరించి ప్రచురించిన అ 'సామాన్యుడు' పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక ఐలాపురం హొటల్‌లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ సమాజం పట్ల అప్పారావుకి ఉన్న బాధ్యత, పేదవారికి సేవ చేయాలనే తపన ఆయన్ను ముందుకి నడిపిస్తుందన్నారు. డబ్బుల గురించి ఆలోచన చేయకుండా సేవ చేసే మనసు, పట్టుదలతో అనేక కార్యక్రమాలు చేశారని కొనియాడారు. సభాధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మన్నేపల్లి మనసులో ఎన్నో ఉదాత్తమైన ఆలోచనలు, ఉద్వేగభరిత భావాలు అతన్ని ప్రేరేపిస్తున్నాయని చెప్పారు. నేషనల్ చైల్డ్‌లేబర్ ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ పమిడిముక్కల సుధాకర్ మాట్లాడుతూ స్వచ్ఛంధ సంస్థల పేరిట నిధులు సమకూర్చుకున్న తర్వాతే సేవా కార్యక్రమాలు నిర్వహించే నేటి రోజుల్లో ఎలాంటి నిధులు గురించి ఆలోచన చేయకుండా తనవంతు చేయూతను అందించేలానే అరుదైన వ్యక్తిత్వం అప్పారావుది అన్నారు. ఈ సందర్భంగా అప్పారావు కుటుంబ సభ్యులను టీడీ జనార్ధన్‌తో పాటు అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంక దినకర్, అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, సామాజిక సేవకులు మన్నే పల్లి అప్పారావు, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## స్వార్థ చింతన లేనివి



దాహం తీర్చే నీటికి లేదు
మనిషిని మోసే పుడమికి లేదు
ఏమాత్రం భేదభావము
గొడుగై నిలిచే నింగికి లేదు
జలజల పారే యేరుకు లేదు
మిలమిల మెరిసే తారకు లేదు
ఏమాత్రం అహంకారము
కిలకిల నవ్వే పాపకు లేదు
ఫలాలు పంచే తరువుకు లేదు
జలాలు ఒసగే చెరువుకు లేదు
ఏమాత్రం రాగద్వేషాలు
పొలాలు ఇచ్చే పంటకు లేదు
కళకళలాడే పూలకు లేదు
టపటప కురిసే చినుకుకు లేదు
ఏమాత్రం స్వార్థ చింతన
చల్లగ వీచే గాలికి లేదు

**-గద్వాల సోమన్న**
9966414580

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి-జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



**జగిత్యాల అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**::భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు కేంద్ర ప్రభుత్వ జన సురక్షా భీమా పథకాలైన "ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన" మరియు "ప్రధాన మంత్రి సురక్షా భీమా యోజన" కోసం జిల్లా పరిధిలో ఉన్న అర్హులైన వారందరూ నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. సహజ మరణం మరియు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే ఆ కుటుంబ సభ్యులైన నామినీ కి కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఆర్థిక భరోసా ఇస్తుందని ఆయన అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ మరియు బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని అన్ని బ్యాంకుల బ్రాంచీలు తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఖచ్చితంగా శిబిరాలు నిర్వహించి ఎక్కువ మొత్తంలో నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే అన్ని బ్యాంకుల కార్యక్రమానికి సంబంధించి కార్యచరణ రూపొందించామని అమలు చేయడానికి తగు ప్రణాళిక సిద్ధం చేసినట్లుగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ తెలిపారు.

## రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గన్నవరం, అక్టోబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో.. 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్.. మరియు 33/11 కె.వి కేసరపల్లి సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును.. రేపు అనగా (18-10-24) ఉదయం 08:00 గంటల నుంచి 11:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు (కేసరపల్లి సబ్ స్టేషన్ పరిధిలో) కేసరపల్లి మొత్తం ఏరియా. ఎస్ ఎల్ వి విల్లాస్. అప్పారావుపేట. అర్జెంపూడి . బుద్ధవారం. బూతుమేల్లిపాడు. జక్కుల నెక్కలం జగనన్న కాలనీ. వియన్ పురం కాలనీ. (గన్నవరం సబ్ స్టేషన్ పరిధిలో టైం మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు ఉండని ప్రాంతాలు) మర్లపాలెం, చిన్నఅవుటపల్లి, మేఘన రోడ్డు, వేపగుంట, కాటా,ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును కావున గృహ వినియోదారులు. వ్యాపార వినియోగదారులు. వ్యవసాయ వినియోగదారులు.పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

## ఏపీ జెన్కో శిక్షణ సంస్థలో మహర్షి వాల్మీకి జయంతి



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 17(వార్తా ప్రభ ప్రతినిధి):-** ఏపీ జెన్కో శిక్షణ సంస్థలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శిక్షణా సంస్థ చీఫ్ ఇంజనీర్ ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ అధర్మం నుంచి ధర్మం వైపు, అసత్యం నుంచి సత్యసంధత వైపు సమాజాన్ని నడిపించాలన్నదే మహర్షి వాల్మీకి ఆశయం అని తెలిపారు. మానవుని జీవితాన్ని సుఖమయం, ఆదర్శవంతం చేసే ఎన్నో ధర్మాలను రామాయణంలో పొందుపరిచారు వాల్మీకి. మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను రామాయణం మనకు బోధిస్తుంది. రామాయణ మహా కావ్యాన్ని లిఖించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆ దివ్య పురుషున్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సంస్థ, ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.సుశీల, జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) యు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు హరిబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సాహిత్యానికి ఆద్యుడు వాల్మీకి





**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి):-** భారతీయ సాహిత్యానికి ఆద్యుడు మహర్షి వాల్మీకి అని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృత సాహిత్యంలో పేరెన్నిక గలిగిన కవి వాల్మీకి అని కొనియాడారు. రామాయణాన్ని రాసిన ఈయన ఆదికవిగా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. శ్లోకమనే ప్రక్రియను కూడా ఈయనే కనుగొన్నారని తెలిపారు. అనంతరం ఈ నెల 19న మండలంలో జరిగే పల్లె పండుగ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములై పల్లె పండుగను విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీవో సునీత శర్మ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. **గుంటుపల్లిలో**గుంటుపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ భూక్యా కవిత ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, ఇబ్రహీంపట్నం పీహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్, గ్రామ నాయకుడు సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఆర్ కళాశాల స్థలం కాపాడటంలో పూర్వ విద్యార్థుల పోరాటానికి అండగా ఉంటా

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా హామీ



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలోని ప్రముఖ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వం కళాశాలకి చెందిన స్థలాన్ని కొందరు కబ్జా చేయటంతో ఆ స్థలాన్ని కాపాడుకోవటం కోసం కళాశాల పూర్వ విద్యార్థులు సాగిస్తున్న పోరాటానికి తాను అండగా ఉంటానని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. ఇటీవల కళాశాలకి చెందిన స్థలం లేదని తమ స్థలమే ఉందని ఆక్రమణదారులు పత్రికాముఖంగా చెప్పటాన్ని పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బోండా ఉమా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా కళాశాల స్థలాన్ని కాపాడటంలో పూర్వ విద్యార్థులు, కళాశాల యాజమాన్యం చేసే పోరాటానికి పూర్తిగా మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాల స్థలాన్ని భవిష్యత్తు తరాల అవసరం కోసం రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎమ్మెల్యేను కలిసి పూర్వ విద్యార్థి సంఘ నాయకులు దోనేపూడి శంకర్, వెలగా జోషి, సంఘం అధ్యక్షులు లంక జానయ్య, కార్యదర్శి చిగురుపాటి యుగంధర్, ఉపాధ్యక్షులు ఆళ్ల వేణుగోపాలరావు తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో విధిగా చేపట్టాలి

**- పీఏసీ చైర్మన్ శాసనసభ్యులు అరికెపూడి గాంధీ**

**కూకట్ పల్లి, అక్టోబర్17(వార్తప్రభ):** నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో విధిగా చేపట్టాలనీ పీఏసీ చైర్మన్, శేర్లింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు సుందరికరణ, సంరక్షణ,అభివృద్ధి పనులలో భాగంగా 2 కోట్ల 74 లక్షల రూపాయల అంచనావ్యయం తో చెరువులో మురుగు నీరు కలవకుండా చేపడుతున్న మురుగు నీటి మల్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులను గురువారం ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు సుందరికరణ, సంరక్షణ,అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది అని, చెరువు లో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజి వ్యవస్థ మల్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజి వ్యవస్థ మల్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులకు వేగం పెంచాలని చెప్పారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపెట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని తెలియచేసారు. చెరువులో కలుషిత నీరు కలవకుండా సస్యశ్యామలంగా చక్కటి ఆహ్లాదకరంగా చెరువును పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎందరో కవుల స్ఫూర్తితో ప్రపంచం సంస్కరించబడుతూ ముందుకు సాగుతుంది.- కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 17 (వార్తాప్రభ)** :శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని నల్లగండ్ల హుడా కాంప్లెక్స్ లో శేరిలింగంపల్లి సాహితీ,సాంస్కృతిక కళా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కవి సమ్మేళనం,కవుల ఇష్టా గోష్టి కార్యక్రమం జరిగింది..ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో ప్రజలను అన్ని రంగాల్లోనూ చైతన్యవంతం చేసేందుకు కవులు కళాకారులు రచయితలు ప్రముఖ పాత్ర వహించడం జరుగుతుందన్నారు.సమాజంలో జరుగుతున్న అవినీతి,అన్యాయాలను ప్రశ్నించడం, ఉద్యమించటం కవులు,కళాకారుల పోరాట స్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఎందరో కవుల స్ఫూర్తితో ప్రపంచం సంస్కరించబడుతూ ముందుకు సాగుతుందని ఆయన వెల్లడించారు.అనంతరం శేరిలింగంపల్లి సాహితీ సాంస్కృతిక కళా సేవా సమితి అధ్యక్షురాలు ట్యాగ్ లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి సభాధ్యక్షులుగా వ్యవహరించగా అధ్యక్షులు మోటూరి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవీంద్ర బాబు అరవా ఆధ్వర్యంలో కవుల ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది..ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి.డి.రాజగోపాల్ ,ప్రముఖ పారిశ్రామికవేత్త వినోద్ గౌడ్,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తాడిబోయిన రామస్వామి యాదవ్ ప్రభృతులు హాజరై శేరిలింగంపల్లి సాహితీ సాంస్కృతిక కళా సేవా సమితి భవిష్యత్తు కార్యాచరణ, సాహిత్య,సాంస్కృతిక కళా వికాసం,అభ్యున్నతి అనే అంశంపై డాక్టర్ గోగు వెంకటేశ్వర్లు,,భమిడిపాటి వెంకటేశ్వరరావు,,డాక్టర్ దూత రామకోటేశ్వరరావు,, సుమ చంద్ర ,డి.వి.ఆర్.మూర్తి,సిహెచ్. రంగనాయకమ్మ,కొలచన విజయభారతి,కండే సుప్రియ,సత్యవీణ మొండ్రేటి,మోదేపల్లి శీనమ్మ,ఉషారాణి,కవి మొగలిమాల,గుండ్ల నారాయణ,కందూరు చంద్రప్రకాష్ గుప్త పలువురు కవులు,కళాకారులు తమ సలహాలు,సూచనలను అందించారు.సంస్థ ఉపాధ్యక్షులు జేవి కుమార్ వందన సమర్పణ చేశారు.ప్రముఖ కవి దూత రామ కోటేశ్వరరావు రచించిన సభకు నమస్కారం పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.అనంతరం కవి సమ్మేళనం,ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొన్న కవులను శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలువురు కవులు,కళాకారులు రచయితలు పాల్గొన్నారు.






## శ్రీ శ్రీ శ్రీ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

**● వాల్మీకి తోనే శ్రీరాముడు ఆ స్థాయికి ఎదిగారు ● పరిపాలనకు శ్రీరాముడు ఆదర్శమూర్తి ● శ్రీరాముడి స్ఫూర్తితోనే పరిపాలన ● ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు- పాల్గొన్న కాంగ్రెస్ నేతలు**

**కూకట్ పల్లి,అక్టోబర్17 (వార్తప్రభ):** శ్రీ శ్రీ శ్రీ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ,వాల్మీకి సోదరులకు వాల్మీకి మహర్షి జయంతి తెలుపుతూ ఆదికవి వాల్మీకి మహర్షి రామాయణం రచించారని, మనం ఏదో సందర్భంలో రామాయణం గురించి ఆ సీతారాముల గురించి ప్రపంచానికి తెలియజేశారు. అలాంటి మహర్షి జయంతి ఒక పండగ వాతావరణం నెలకొంటుందన్నారు, ప్రతి ఒక్కరూ భక్తి భావంతో దేవుని అనుగ్రహం ఉన్న ఉన్నప్పుడే మనం ఏ పని చేసినా ఆ పనిలో విజయం కలుగుతుంది తెలిపారు.కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి పాల్గొని నియోజకవర్గంలో ప్రతి డివిజన్లో పండగ వాతావరణం నెలకొందని, వాల్మీకి మహర్షికి పూజించుకొని అన్ని వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వాల్మీకి మహర్షి ఆశీస్సులతో ఉండాలని శేరి సతీష్ రెడ్డి అన్నారు, ఈ కార్యక్రమములో రంగస్వామి వెంకటేశ్వరరావు,తమ్మినేని ప్రవీణ్ కుమార్, ఫణీంద్ర కుమార్ పొడుగు అప్పారావు వాల్మీకి అసోసియేషన్ సభ్యులు మరియు నాయకులు మహిళా నాయకురాలు పాల్గొన్నారు...



## గుడుంబా స్థావరాల పై పోలీస్ మెరుపు దాడులు

**దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజు**

**దంతాలపల్లి అక్టోబర్ 17 (వార్తా ప్రభ)** మండలంలోని వాల్య తండా గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో, గురువారం దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజు ఆధ్వర్యంలో గుడుంబా స్థానాలపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా తయారుచేసిన 15 లీటర్ల గుడుంబాను, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ నిషేధిత అక్రమ బెల్లం గుడుంబా వ్యాపారం చేస్తే వారిపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుడుంబా తయారుచేసిన శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చందర్ పోలీస్ సిబ్బంది గణేష్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## అడవితల్లి ముద్దుబిడ్డ కొమురం భీం 84 వర్ధంతి

**-నివాళులు అర్పించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి..**

**అదిలాబాద్అక్టోబర్ 17 (వార్తా ప్రభ)** జల్,జంగల్,జమీన్ నినాదంతో అడవి బిడ్డల హక్కులకోసం పోరాడిన కొమురం భీం పోరాట పటిమ ఎన్నటికీ మరువలేనిదని, వారి ఆశయ సాధనకోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నేడు ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక కొమురం భీమ్ 84 వర్ధంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కొమురం భీం చౌక్ లోని అయన విగ్రహానికి కాంగ్రెస్ నేతలతో కలిసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూలమామాలు వేసి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ స్వపరిపాలన కోసం,ఆదివాసీ హక్కులకోసం ఆనాటి పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన ఒక గొప్ప వీరుడు కొమురం భీం ని గుర్తుచేశారు

# ధాన్యం కొనుగోళ్లలో రైతులను దగా చేస్తే ఉపేక్షించం

**పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి**



**-పాలకుర్తిఅక్టోబర్ 17 (వార్తా ప్రభ)** ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను దగా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. గురువారంపాలకుర్తి మండలంలోని పాలకుర్తి సొసైటీ ఆధ్వర్యంలో మల్లంపల్లిలో, తొర్రూరు సొసైటీ ఆధ్వర్యంలో తొర్రూరులో, ఐకెపి ఆధ్వర్యంలో అయ్యంగారి పల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతును రాజును చేయాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాటుపడుతుందని తెలిపారు. రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్నధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించి రైతు పక్షపాతిగా సీఎం రేవంత్ రెడ్డి రైతులకు అండగా నిలిచారని తెలిపారు. ప్రభుత్వం ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి సరైన మద్దతు ధర ఉంటుందని అన్నారు. నాణ్యత లోపం పేరుతో రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతు పండించిన ఏ గ్రేడు ధాన్యానికి 2320, సీ గ్రేడు ధాన్యానికి 2300 ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. తేమశాతం 17 వరకు ఉండాలని, కల్లాల వద్దే ధాన్యాన్ని ఆరబెట్టి, తూర్పార బట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. కాంత అయిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లతో గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సొసైటీల చైర్మన్లు గోనే మైసిరెడ్డి, బొబ్బల అశోక్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, డి ఆర్ డి ఓ పి డ వసంత, డి సి ఎస్ ఓ సరస్వతి, డి సి ఓ రాజేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, పాలకుర్తి సొసైటీ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, డిపిఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం పిట్టల నరేందర్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు గిరగాని సుధారాణి, మండల కార్యదర్శి ప్రమీల, తొర్రూరు సొసైటీ సీఈఓ మాసంపల్లి రణధీర్, పాలకుర్తి సొసైటీ అకౌంటెంట్ మధుకర్ రావు, సిసి కారుపోతుల వెంకటేశ్వర్లు తో పాటు సొసైటీల డైరెక్టర్లు సుధాకర్, ప్రభాకర్, చింతం వెంకన్న, ఐకెపి సీఏలు, సొసైటీ, ఐకెపి సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆదివాసీ కొమురం భీం 84వ వర్ధంతి వేడుకలు

**ములుగు,అక్టోబర్:17(వార్తా ప్రభ)** ఆదివాసీ నాయకపోడ్ ములుగు జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలోగురువారం ములుగు గట్టమ్మ దేవాలయం వద్ద ఆదివాసీల పోరాటాల యోధుడు కొమురం భీం 84 వర్ధంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకపోడ్ జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ మాట్లాడుతూ జల్ జంగిల్ జమీన్ అనే నినాదాలతో ఆదివాసులను ఏకం చేసి స్వయంపాలన కొరకు పోరాటం చేసిన యోధుడు గొండ్ జాతి ముద్దుబిడ్డ కొమురం భీం అని అన్నారు. బ్రిటిష్ కాలంలో తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన యోధుడు కొమరం భీమ్ అని తెలిపారు .భారతదేశంలో పది శాతం ఆదివాసి జనాభాకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సక్రమంగా నిర్వహిస్తే అభివృద్ధిలో ఆదివాసులు ముందు ఉంటారని అన్నారు . కానీ ఐటీడీఏ ప్రాంతాలను ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసుల హక్కులు నిర్వీర్యమై ఆదివాసుల బతుకులు ఎండిపోతున్నాయని అన్నారు.

# విద్యాదాత కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.

**- 50 లక్షల సొంత ఖర్చుతో పాఠశాల నిర్మాణమే కాక పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న కార్పొరేటర్**





**శేరిలింగంపల్లి,అక్టోబర్ 17 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి డివిజన్ లోగల సురభి కాలనీలో స్థానిక పేద ప్రజల పిల్లలు చదువుకు దూరం కావద్దనే సంకల్పంతో ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డ్ ఛైర్పర్సన్ రాగం సుజాత యాదవ్,శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తమ సొంత ఖర్చులతో ఎంపిపిఎస్ పాఠశాలను నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత పేద ప్రజల పిల్లలు బాల బాలికలు విద్యను అభ్యాసించాలని 2016 సంవత్సరంలో అందుబా టులోకి తీసుకొచ్చారు.2016 సంవత్సరములో 8 మంది విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాల ప్రస్తుతం సుమారుగా 450పై చిలుకు విద్యార్థులు విద్యనభ్యాసిస్తున్నారు. కార్పొరేటర్ చొరవతో తన సొంత ఖర్చులతో ఉపాధ్యాయులకు నెలసరి వేతనాలు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం తరుపున ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు మెరుగైన విద్య అందించలేకపోతున్నాము అనే ఆలోచనతో ప్రభుత్వ ఉపాధ్యాయుల కొరకు గత కొన్ని ఏళ్ళుగా ప్రయత్నించడం జరిగిందని ఇటీవలే విద్యా కమిషన్ చైర్మన్ ఆకుల మురళి ని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలసి ఉపాధ్యాయులను నియమించుట కొరకై వినతి పత్రం అందచేయగా వారు సానుకూలంగా స్పందించి పై అధికారులకు వివరించగా 24గంటల్లో ప్రభుత్వం తరుపున ఆరుగురు ఉపాధ్యాయులను నియమించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ సీఎం రేవంత్ రెడ్డి కి,విద్యా కమిషన్ ఛైర్పర్సన్ ఆకుల మురళి కి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్పొరేటర్ సంతోషం వ్యక్తం చేస్తూ పేద కుటుంబాలకు చెందిన బాల బాలికల చదువు కొరకు నా వంతు కృషి ఎల్లపుడు ఉంటుందని అన్నారు.విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని,ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఎంపీపీఎస్ పాఠశాల ఉంటుందని, విద్యార్థులు మంచి మార్కులతో పదవ తరగతి పూర్తి చేసుకుని పై చదువులు చదువుతున్నారని అన్నారు.ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు జిల్లా పరిషత్ పాఠశాలలో కలిసినప్పుడు ఆంగ్ల భాషలో ప్రావీణ్యత కనపరుస్తూ మాట్లాడడం గర్వంగా ఉందని అన్నారు.విద్యార్థులు ఉన్నతమైన స్థాయి కి ఎదగాలని ఐఏఎస్,ఐపీఎస్, లాయర్,ఇంజనీర్ అవ్వాలని ఆకాంక్షించారు.హెచ్.ఎం గంగాధర్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పెద్ద మనసుతో ఈ ప్రాంత పేద ప్రజల పిల్లలు చదువులకు దూరం కావద్దని తమ సొంత ఖర్చులతో సుమారుగా 50 లక్షల రూపాయలతో పాఠశాలను అందుబాటులోకి తెచ్చినందుకు గర్వపడుతూ, ప్రైవేటు పాఠశాలకు దీటుగా విద్యాబోధనలు విద్యార్థులు అభ్యసిస్తున్నారని కార్పొరేటర్ ఎల్లప్పుడూ ముందుండి సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. నూతనంగా విచ్చేసిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ..తమ శక్తివంచన లేకుండా విద్యార్థిని విద్యార్థులకు భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుటకై ఉన్నతమైన విద్యాబుద్ధులను అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్ ఎం గంగాధర్ రావు,స్కూల్ మానేజ్మెంట్ కమిటీ ఛైర్మెన్ బస్వరాజ్,వైస్ ఛైర్మెన్ సుమలత,వార్డ్ మెంబర్ శ్రీకళ వెంకటేశ్వర్లు, అశ్రఫ్,నూతన ఉపాధ్యాయులు పాండురంగ రావు,మౌనిక,మాధవి, విజయ,పూజిత,వనిత,స్థానిక వాసులు సారయ్య గౌడ్, యోగి,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజలకు సేవ చేస్తూనే ఉంటా

**ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి**





**కనిగిరి అక్టోబర్ 17 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి పట్టణంలో జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో అమరావతి గ్రౌండ్స్ లో మెగా ఉచిత మోకాళ్ళ కీళ్ళ వైద్య శిబిరంవైద్య శిబిరంలో పాల్గొన్న వారికీ ఉచితంగా ఇసిజి, ఎఖో, రక్త పరీక్షలు, ఎక్స్రే పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ కు అవసరమైన వారిని ఎంపిక చేశారు . మెగా ఉచిత మోకాళ్ళ కీళ్ల మార్పిడి వైద్య శిబిరం కు గురువారం విశేష స్పందన లభించింది. 224 మందికి వైద్య పరీక్షలు 60 మంది శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు.వైద్యశిబిరంను ఎమ్మెల్యే డా ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సందర్శించి పేషెంట్స్ తో మాట్లాడి అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు హాజరైన వారికీ ఉచితంగా భోజన వసతి కల్పించారు వైద్య శిబిరంలో డా ఇంద్ర ప్రసాద్, గుండె వైద్య నిపుణులు డా శ్రీనివాసులురెడ్డి, వలంటీర్లుగా షేక్ జంషీర్ అహ్మద్, తులసి, రెహ్మాన్, బాబు, వాజీదా బేగం, ఖాజా, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ విగ్రహానికి నివాళు లర్పించిన జల్ జంగల్

**- బిజెపి పార్టీ తరఫునుంచి ఘనంగా నివాళులు**
**- ఎమ్మెల్యే పాయల్ శంకర్.**



**అదిలాబాద్అక్టోబర్ 17 (వార్తా ప్రభ)** ఆనాడు జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన గొప్ప నాయకుడు కొమరం భీమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.కొమురం భీం వర్ధంతి ని పురస్కరించుకొని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కొమరం భీం చౌక్ లోని భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.ఆరోజు ఆదివాసులు,మిగతా ప్రజల జీవితాలతో ఆనాడు ఉన్నటువంటి నిరంకుశ పాలనను ఎదిరించడానికి జల్,జంగల్, జమీన్ కోసం పోరాడిన గొప్ప నాయకుడు కొమరం భీమ్ అన్నారు.భౌతికంగా ఆయన మన మధ్య లేనప్పటికీ ఆయన ఆశయాలకు అనుగుణంగా మనమందరం ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.మారుతున్న పరిస్థితులలో ఆదివాసుల జీవితాలలో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు.పార్టీలు ఏవైనా కావచ్చు పాలకులు ఎవరైనా కావచ్చు ఆనాడు కొమరం భీం కన్నా కళలు,ఆశలను పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు.గడచిన పదేళ్లలో ఆదివాసి బతుకులు మారలేదన్నారు.గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా కొనసాగిస్తుందని ఎద్దవా చేశారు.ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూములకు ఇంతవరకు పట్టాలు ఇవ్వలేదన్నారు.అందరూ మందికి ఉండడానికి ఇండ్లు లేవన్నారు. వారి బతుకులను మార్చాల్సిన అవసరం ఉందన్నారు.గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల మంది రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అయినప్పటికీ గతంలో ఉన్న ప్రభుత్వం ఆ నిధులను పక్కదారి పట్టించిందని గుర్తు చేశారు.అదే రీతిలో ఈ ప్రభుత్వం సైతం నిధులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లాలా మున్నా జోగురావి.నైతం రవీందర్, దశరథ్ పటేల్,రాకేష్,నగేష్ రెడ్డి, శ్రీనివాస్,అశోక రెడ్డి,సందీప్ తదితరులు

## ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీతో చేరికలు

**-మాజీ ఉపసర్పంచ్ తో సహా బిజెపిలో చేరిన 200 మంది**

**పార్టీ కండువా కప్పి స్వాగతం పలికిన ఎమ్మెల్యే పాయల్ శంకర్.**

**అదిలాబాద్ అక్టోబర్ 17 (వార్తా ప్రభ)** జైనథ్ మండలంలోని బెల్లూరి గ్రామం మాజీ ఉపసర్పంచ్ దుర్వాచంపత్ రావు తో పాటు 200 మంది పార్టీలో చేరారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఉపసర్పంచ్ బెల్లూరికి చెందిన 200 మంది టిఆర్ఎస్ కార్యకర్తలు బిజెపిలో చేరారు.వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో బిజెపి ఎమ్మెల్యేగా మిమ్మల్ని మేము గెలిపించుకుంటామని ఆ తర్వాత పార్టీలో చేరుతామని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీ మేరకే నేడు పార్టీలో చేరడం సంతోషకరమన్నారు.బీజేపీ పార్టీలో పనిచేస్తుంటే దేశ రక్షణలో ఆర్మీ జవాన్ రక్షణ కల్పిస్తాడు, అదే సంతృప్తి పార్టీ కార్యకర్తల్లో లభిస్తుందన్నారు. గత పది సంవత్సరాలు టిఆర్ఎస్ పాలించిన,కొత్తగా కాంగ్రెస్ పార్టీ అధికారం కొచ్చిన ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీ కూడా అమలు చేయలేదని అన్నారు.రైతులకు రుణమాఫీ ఇప్పటివరకు కాలేదన్నారు.2000 రూపాయలు ఉన్న పెన్షన్ 4000 రూపాయలు ఇస్తామన్న మాట ఇప్పటివరకు ఏ ఒక్కరికి అమలు కాలేదు అన్నారు.నియోజకవర్గ సమస్యలను సానుకూలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా తీసుకెళు న్నానని,గతంలోనైతే ఏ విధంగా టిఆర్ఎస్ పైన పోరాటం చేశాను అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై నేడు పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

# ముగిసిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం - ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కే మోతిలాల్



**విస్సన్నపేట,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** స్థానిక శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థలలో ప్రిన్సిప ల్ సివిల్ జడ్జి కే మోతిలాల్ విద్యార్థిని విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో భాగంగా చట్టం గురించి వివరించారు. అన్యాయం జరిగినప్పుడు న్యాయస్థానం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం న్యాయం కోసం ఎదుర్కొనే విధి విధానాలను ఆయన తెలియజేశారు .శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ మేడా హర్ష, మోరంపూడి సత్యనారాయణలు సివిల్ జడ్జ్ మోతిలాల్ కు పట్టు శాలువా పూలదండలతో ఘనంగా సత్కరించారు. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి లక్ష్మీనారాయణ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎం నాగేంద్రప్రసాద్ సిహెచ్ వెంకట్ రెడ్డి ఎం సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు - ఎంపీడీవో చిన్న రాట్నాలు



**విస్సన్నపేట,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** కృషి ఉంటే మనుషులు ఋషులు అవుతారు అని వారు మహా పురుషులు కూడా అయ్యే అవకాశం ఉంటుందని దానికి ఉదాహరణ వాల్మీకి మహర్షి అని ఎంపీడీవో చిన్న రాట్నాలు వాల్మీకి జయంతి ఉత్సవ కార్యక్రమంలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో మండలంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు. రత్నాకరుడనే వ్యక్తి అట్టడుగు స్థాయి నుండి నారద మహాముని బోధతో జ్ఞానోదయం చెంది వాల్మీకిగా ఖ్యాతి పొంది తపస్సు సంపన్నుడై శ్రీరాముని దయతో రామాయణం రచించడం జరిగిందని ఆయన చెప్పారు. రత్నాకరుడుగా ఉన్న సమయంలో ధ్యానంలో ఎక్కువ సమయం పుట్ట (సంస్కృతంలో వాల్మీకం) లో గడపటం చేత వాల్మీకి అనే పేరు అక్కడ నుండి ఉద్భవించిందని భావిస్తూ ఉంటారు అని అన్నారు. ఎవరైనా ఎప్పుడైనా ఎక్కడైనా వారి ముందస్తు చర్యలతో సంబంధం లేకుండా తీవ్రమైన పశ్చాతాపం మరియు అంకితభావం ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సాధించగలరని మరియు జ్ఞాని అవుతారనే ఆలోచనకు ప్రత్యక్ష సాక్ష్యం ఆది కవి వాల్మీకి మహర్షి అని ఆయన తెలిపారు. సుగ్రీవ జాంబవంత ఆంజనేయ నీల వానర సమూహం సహాయ సహకారాలతో రామ రామ యుద్ధంలో రావణాసుర కుంభకర్ణుడు ఇంద్రజిత్తుల వద అనంతరం సీత మహాసాధ్వి అయోధ్యకు వచ్చిన తరువాత అభియోగాలతో నిందు శూలాలు అయిన ఆమె లవకుశలు జననం వారి పెరుగుదల శ్రీరాముని అశ్వమేధ యాగం జననం అన్ని వాల్మీకి ఆశ్రమంలోనే జరిగినట్లుగా మనకు రామాయణం ద్వారా తెలుస్తుంది అన్నారు. త్రేతాయుగంలో శ్రీ సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల కథకు సంబంధించి ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధం ఉన్న మహోన్నతుడు వాల్మీకి కావటం గిరిజన కుటుంబానికి చెందిన ఆయన మహాఋషి కావటం గొప్ప విషయం అన్నారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు దంపతులు ఏవో . సిహెచ్ ప్రసాద్ ఇన్చార్జి ఈవోపీఆర్డి హరికృష్ణ మండల ప్రజా పరిషత్ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజులకే రారాజు శ్రీకృష్ణ దేవరాయ - ఎమ్మెల్యేలు పంతం,వనమాడి

- దేశ భాషలందు తెలుగు లెస్సా అని చాటి చెప్పిన మగధీరుడు-వాసిరెడ్డి
- ఆంధ్రా కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయలు 495 వర్ధంతి



**కాకినాడ రూరల్,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** ప్రజాపాలనలో రాజులకే రారాజు శ్రీకృష్ణ దేవరాయలు అని రూరల్ ఎమ్మెల్యేలు పంతం వెంకటేశ్వర రావు (నానాజీ), కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు , దేశభాష లందు తెలుగు లెస్సా అని చెప్పిన మగధీరుడు కాపు జాతికే వన్నెతెచ్చిన గొప్ప మహారాజు అని ఆంధ్రా కాపు సద్భావన సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి యేసుదాసు కొనియాడారు.స్థానిక ఎన్ ఎఫ్ సి ఎల్ రోడ్డు కాపు కళ్యాణ మండపం కూడలిలో ఆంధ్రా కాపు సద్భావన సంఘము గౌరవ అధ్యక్షులు బసవా ప్రభాకర రావు,కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ ఆధ్వర్యంలోమహారాజ ఆంధ్ర భోజ శ్రీకృష దేవరాయలు 495వ వర్ధంతి సందర్భంగా రాయల వారికి గజమాల వేసి ప్రజా ప్రతినిధులు ,ఘన నివాళి అర్పించి జోహార్ శ్రీ కృష్ణ దేవరాయ, జయహో శ్రీ కృష్ణ దేవరాయఅని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ఎప్పుడు మన దేశ అభివృద్ధి గురించి మాట్లాడుకోవాలంటే రాయలవారి కాలం నుండి పరిపాలన గుర్తు చేసుకోవాలని 500 సంవత్సరాల క్రితమే రాయల పాలన ఒక స్వర్ణ యుగంగా చరిత్ర చెబుతుందని రత్నాలు రాశుల కింద పోసి అంగట్లో అమ్మేవారిని గుర్తు చేశారు.ఆయన కాలంలోనే ముఖ్య మంత్రి,మంత్రులు పరిపాలన దక్షితకు దిక్సూచి శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాకినాడ తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు,కాపు సద్భావన సంఘం ఉపాధ్యక్షులు మాధవరపు పట్టాభి రామయ్య ,అడపా ప్రకాష్ నాయుడు, కోశాధికారి రంగనాయకులు మీడియా ప్రతినిధి బిందాన సురేష్ బాబు కార్యవర్గ సభ్యులు గొల్లపల్లి లక్ష్మణరావు, సీతయ్య దొర, తుమ్మలపల్లి వాసు,దామిశెట్టి శ్రీను, కొప్పిశెట్టి శ్రీను,కోన సోమేశ్,రెడ్నం రాజా , కర్ణాసుల సత్యనారాయణ, నూకల బలరాం, కనపర్తి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే యార్లగడ్డ ను 100 నోట్ల దండతో సన్మానించిన లంక బాబు సురేంద్ర మోహన్ బెనర్జీ



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఆధ్వర్యంలో గణనీయంగా జరుగుతున్నాయి. వర్షాలను సైతం లెక్కచేయకుండా యార్లగడ్డ వెంకట్రావ్ గ్రామాల్లో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. సీనియర్ తెలుగు దేశం పార్టీ నాయకులు లంక బాబు సురేంద్ర మోహన్ బెనర్జీ 100 రూపాయల నోట్లతో తయారు చేసిన దండను ఎమ్మెల్యే యార్లగడ్డ కు వేసి అభినందించారు. నూతన శాలువాతో సన్మానించారు. యార్లగడ్డ వెంకట్రావ్ గన్నవరం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతున్నారని అభినందించారు.

# భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్ ప్రధానోత్సవం



**కాకినాడ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అండ్ గెట్ చీఫ్ కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ అధ్యక్షావని జిల్లా పోర్టు అండ్ గైడ్స్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో డి ఈ ఓ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్పోర్ట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేసి విద్యార్థులతో క్రమ శిక్షణ ఉత్తమ గుణగుణాలు పెంపొందించాలని సమాజానికి ఉత్తమ పౌరులు అందించాలని అన్నారు.అనంతరం సుమారు 40 మంది స్పోర్ట్ మాస్టర్లకు 40 మంది గైడ్ టీచర్లకు సర్టిఫికెట్స్ అందజేసారు.ఈ కార్యక్రమం జిల్లా సెక్రెటరీ ఎన్ వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంషాద్ బేగం, జిల్లా జాయింట్ సెక్రటరీల వి. మాచరరావు, డివిఎస్ లక్ష్మి కుమారి, అసిస్టెంట్ ట్రైనింగ్ కమిషనర్లు నీలిమ, కే .సుబ్రహ్మణ్యం, శ్రీహరి రాజు, రాజేశ్వరి, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తి పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వైసీపీ నాయకులు




**పెడన,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** పట్టణంలో మున్సిపల్ కౌన్సిలర్ గా మరియు తన సతీమణి మున్సిపల్ చైర్పర్సన్ గా ఎంతో మర్యాదలు పరువు ప్రతిష్టలు సంపాదించుకున్న తనపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తూ వార్తాపత్రికలలో అసత్య వార్తలకు కారణమైన మామిడి సత్యనారాయణ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు కటకం. బాబు దుర్గ వెంకట వరప్రసాద్ మామిడి సత్యనారాయణ పై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తన అనుచరులతో మరియు ఆర్యవైశ్య సంఘం సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ పెడన పట్టణంలో గత 15 సంవత్సరాల పైనుండి రాజకీయ నాయకుడిగా మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడుగా తన సతీమణి పురపాలక సంఘ చైర్పర్సన్ గా కొనసాగుతూ ఉన్నామని ఎప్పుడు ఎవరి వద్ద నుండి కూడా ఎటువంటి ఆరోపణలు లేకుండా ఎంతో గౌరవం మర్యాదలు సంపాదించుకున్నామని ఇప్పుడు తనపై అసత్య ఆరోపణలు మామిడి సత్యనారాయణ చేయడం సమంజసం కాదని దీనిపై పట్టణంలో తనకున్న పరువు ప్రతిష్టలపై భంగం కలిగిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అతని వెనుక కొంతమంది రాజకీయ నాయకుల ప్రోత్బలం ఉండే ఉంటుందని తనపై ఏదో విధంగా దురద జల్లాలని ప్రయత్నంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సత్యనారాయణ ను కోరారు. ఫిర్యాదు చేయడానికి వెళ్ళిన కటకం వెనుక పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ( చిన్నా ) ప్రముఖ వ్యాపారవేత్త తమ్మన సుబ్బారావు మున్సిపల్ వైస్ చైర్మన్ కాజా వైసిపి నాయకులు కోమట్ల అనిల్ రౌతుల అన్నవరం వన్నం రామారావు, హానీఫ్ ఖాన్ మామిడి నరసింహారావు తదితరులు ఉన్నారు.

# మైలవరం లో ఇసుక,మట్టి అక్రమ రవాణాపై దాడులు

- పూరగుట్ట సమీపంలో జేసీబి ని సీజ్ చేసిన రెవిన్యూ అధికారి
- బుడమేరు వాగులో జేసీబి ని సీజ్ చేసిన పోలీసులు
- ఇసుక, మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు-ఏసీపీ వై.ప్రసాదరావు







**మైలవరం,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణ పరిధిలో యాధేచ్ఛగా సాగుతున్న ఇసుక,మట్టి అక్రమ రవాణాపై పోలీసులు రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. మైలవరం సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో బుడమేరు వాగులో ఇసుక తోడి డంప్ చేస్తున్నారని సమాచారం రావడంతో ఎసిపి వై.ప్రసాదరావు ఆదేశా లతో స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడులలో జేసిబి ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అలాగే పూరగుట్ట ఇళ్ల సమీపంలో జరుగుతున్న మట్టి అక్రమ తోలకాలపై ఫిర్యాదులు అందడంతో స్థానిక రెవిన్యూ అధికారులు దాడులు నిర్వహించారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని ట్రాక్టర్లకు లోడుచేస్తున్న జేసీబి ని వీఆర్వో సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు.అయితే ఈ దాడులలో ట్రాక్టర్లు ఒక్కటి కూడా దొరక్కుండా జాగ్రత్త పడ్డారు. మట్టి, ఇసుక అక్రమ తోలకాలలో సీజ్ చేసిన జేసీబి లపై పోలీసు,రెవిన్యూ అధికారు లు కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది.ఇదిలా ఉంటే గత కొన్ని రోజులుగా మైలవరం పట్టణ పరిధిలో, అలాగే జి.కొండూరు మండలంలోని చిన నందిగామ గ్రామ పరిధిలో ఇసుక మాఫియా పెట్రేగిపోతోంది.పోలీసులు గట్టి నిఘా పెట్టినప్పటికీ అక్కడక్కడా ఇసుక, మట్టి అక్రమ రవాణా జరుగుతు నే ఉంది.మరోవైపు రెవిన్యూ,ఇరిగేషన్, మైనింగ్ అధికారులు పూర్తిగా చేతులెత్తే శారు.

**ఇసుక, మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు:ఏసీపీ వై.ప్రసాదరావు**

మైలవరం డివిజన్ పరిధిలో అనుమతులు లేకుండా ఇసుక,మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ వై.ప్రసాదరావు హెచ్చరించారు.

# ప్రజావేదిక'కు ప్రజల నుంచి వెల్లువలా వినతులు



**నందిగామ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఏపీ హెూం మరియు విపత్తుల నిర్వహణ శాఖామాత్యులు వంగలపూడి అనితతో కలిసి నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వినతులు స్వీకరించారు.టీడీపీ కార్యాలయానికి ఫిర్యాదుల వెల్లువ వచ్చాయని సౌమ్య తెలిపారు. గత ప్రభుత్వము అరాచకాలను ఎదుర్కొన్న ప్రజలు తమకు న్యాయాన్ని అందించవలసిందిగా కోరుతూ ఎక్కువగా వినతులు వచ్చినట్టు సౌమ్య తెలిపారు. తెలుగుదేశం పార్టీ శ్రేణుల మరియు సామాన్య ప్రజల సమస్యలు విని వాటిని పరిష్కరించడం కోసం వారి నుండి వినతులు మంత్రి అనిత తో కలిసి స్వీకరించినట్టు తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు.అర్జీలపై సంబంధిత అధికారులతో మాట్లాడిన మంత్రి అనిత, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వినతుల పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

# పల్లెల అభివృద్ధి కి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు





**గన్నవరం,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు . గురువారం గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలో రూ.40 లక్షల వ్యయం తో 750 మీటర్ల సీసీ రోడ్డుకు , , తరిగొప్పల గ్రామంలో రూ.27.30 లక్షల వ్యయంతో 420 మీటర్ల సిసి రోడ్డుకు , వేంపాడు గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో 360 మీటర్ల సిసి రోడ్డుకు , చాగంటిపాడు రూ.7.80 లక్షల వ్యయంతో 120 మీటర్లు సిసి రోడ్డుకు , నందమూరు గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో 250 మీటర్ల సిసి రోడ్డుకు , వేమండ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో 350 మీటర్ల సిసి రోడ్డుకు , ఇందుపల్లి గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో 530 మీటర్ల సీసీ రోడ్డుకు , కొయ్యగుర పాడు గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో 450 మీటర్ల సిసి రోడ్డుకు పొనుగుమాడు గ్రామంలో రూ.6.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న 105 మీటర్ల సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అధికారం లోకి వచ్చాక రూ. 4500 కోట్ల ను గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తుందని చెప్పారు. అన్ని విషయాల్లో రాష్ట్రాన్ని దిగజార్చిన ఘనత గత పాలకులకే చెందుతుందనీ విమర్శలు చేశారు . రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం అభివృద్ధి తో పాటు సంక్షేమాన్ని కూడా అందిస్తుందని చెప్పారు . రానున్న రోజుల్లో పల్లెల రూపు రేఖలు మారనున్నాయని స్పష్టం చేశారు . ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి , జనసేన గన్నవరం నియోకవర్గం అధ్యక్షులు చలమలశెట్టి రమేష్ , జన సేన మండల పార్టీ అధ్యక్షుడు బర్మా భాస్కర్ , యడ్లపల్లి సాయి , అజీజ్ , రవి బాబు , నాగేశ్వర రావు , దాదా , రాజ్ కుమార్ , రవీంద్ర , నాగబాబు , శివ , నాగ మల్లేశ్వరరావు, రమేష్ , సుబ్బారావు , పోతు రాజు , సాయి , అనిల్ , గోపి , నాగభూషణం , శ్రీను , జనార్ధన్ రావు , లక్ష్మణ రావు , తుమ్మల రఘు , బెనర్జీ , రాంబాబు , యోహాను , ప్రసాద్ , కృష్ణ ప్రసాద్ , జయ పాల్, సతీష్ , శివ , సాంబయ్య , పైడేశ్వరరావు, సత్యనారాయణ , నాయకులు , కార్యకర్తలు , నాయకులు , కూటమి నేతలు అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం

- టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వీరంకి వీరస్వామిన్



**నందిగామ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** వాల్మీకి జీవిత చరిత్ర ఆదర్శప్రాయమే కాకుండా ఆయన రచించిన రామాయణం ఈనాటి తరాలకే గాక రాబోయే తరాలకు కూడా ఆదర్శప్రాయమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వీరంకి వీరస్వామిన్ కొనియాడారు. గురువారం వాల్మీకి జయంతి జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోనీ రాఘవపురం గ్రామంలో గ్రామ ప్రజలతో కలిసి వీరాస్వామిన్ వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాఘవపూర్వపు మాజీ సొసైటీ అధ్యక్షులు చెందుపాటి శివ నాగేశ్వరరావు,గోపు పూర్ణచంద్రరావు,గ్రామ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, వాల్మీకి అభిమాన సంఘం నాయకులు కృష్ణారామ, కృష్ణమూర్తి, కృష్ణ,శంకర్రావు, రామానాయుడు, పెసరమల్లి సుబ్రహ్మణ్యం,ఏసు, ఆసివు పెల్లి దానయ్య, పరిమి హాజరయ్యా ,కటారపు దాసు, వెంపటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెవనం ఏర్పాటుకు గేమ్ సిగ్నల్

- ఎంపీడీవో చిన్న రాట్నాలు




**విస్సన్నపేట,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** నవ్యాంధ్ర లో పట్టణ ప్రాంతాలలో ఉన్న నగరవనాల నమూనాకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాలలో కూడా మండల కేంద్రాలలో పల్లెవనం ఏర్పాటుకు నరేగా ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంగా శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీవో చిన్న రాట్నాలు తెలియజేశారు. తొలి విడతలో మోడల్ పల్లెవనం ఏర్పాటుకు ప్రతి మండల కేంద్రాలలో చెరువులకు దగ్గరగా సుమారు 25 సెంట్లు స్థలాన్ని రెవెన్యూ సహకారంతో సేకరిస్తున్నట్లు ఆయన చెప్పారు. పల పుష్ప ఔషధ మొక్కలతో నైనానందకారంగా పిల్లలకు పెద్దలకు వృద్ధులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా మొక్కలు ఏర్పాటు చేసి రెండు సంవత్సరాల మెయింటెనెన్స్ తో ఈ మాసాంతానికి ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఈవో పి ఆర్ డి హరికృష్ణ ప్లాంటేషన్ మేనేజర్ కే ఉష ఏపీవో అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలకు,పల్లెలకు మహర్దశ అభివృద్ధి పథంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం



**కాకినాడ రూరల్,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలలో భాగంగా కాకినాడ రూరల్ మండలం సర్పవరం, తూరంగి,కొవ్వూరు, కొవ్వాడ, రేపూరు గ్రామాలలో నూతన రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, జన సైనికులు,వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి కి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



**నందిగామ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చందర్లపాడు మాజీ జెడ్పిటిసి వాసిరెడ్డి ప్రసాద్ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ కు వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. – రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న టీఏ, డీఈవో, హెల్పర్స్ ల కాంట్రాక్ట్ కాలపరిమితి 11 నెలలకు రెన్యువల్ చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సిబ్బంది మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. – డిగ్రీ చదివిన తన దివ్యాంగ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని గుంటూరు శ్రీనగర్ కు చెందిన బొంతల శ్రీనివాసరావు కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. – క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా మందడంకు చెందిన పిల్లపాగ రోశమ్మ విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా చంద్రబాబు పాలన : మంత్రి అనగాని..

- జిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలందరం కలిసికట్టుగా ముందుకు : మంత్రి కొల్లు
- గుడ్లవల్లేరు మండలంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రులు.. కూటమి పార్టీల నేతలు..





**గుడివాడ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** యువతకు ఉపాధి కల్పన లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు సాధించి, పరిశ్రమలు ఏర్పాటు చేసి వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. రెవిన్యూ మంత్రి, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ లతో కలసి రెవెన్యూ మంత్రి గురు వారం కౌతవరంలో 23 లక్షల అంచనా వ్యయంతో ఆధునీకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం ప్రారంభించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర రెవెన్యూ మంత్రి, ఎమ్మెల్యే,,జేసీలతో కలిసి కౌతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్ పి పెట్రోల్ బంక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో రెవెన్యూ మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గుడివాడ అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఆర్థిక స్థిరత్వం లేని పరిపాలనతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి మొదటిగా 5 ఫైళ్లపై సంతకాలు చేశారన్నారు. పింఛన్ల 4 వేలకు పెంపు చేయడంతో పాటు, వచ్చే దీపావళి నుండి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులు చేపట్టిన విషయం మంత్రి గుర్తు చేశారు. గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దోచుకున్న భూములపై విచారణ జరిపి, వాటికి విముక్తి కలిగించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్యేలందరి సహకారంతో బందరు పోర్టు పనులు పూర్తి చేస్తామని, అలాగే గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము మాట్లాడుతూ కౌతవరంలో ఎన్నడూ లేని గొప్ప మెజారిటీతో గెలిపించిన గ్రామస్తులకు ధన్యవాదాలు, అందరూ కలిసికట్టుగా అభివృద్ధికి సహకరిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ కూటమి నాయకులు సురేంద్రబాబు, బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని బాబ్జి, వల్లభనేని బాబురావు, మల్లిపెద్ది సుబ్బారావు తదితరులు సభలో మాట్లాడారు. రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డిఐజి రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ ఎంఎస్ గోపాలకృష్ణమూర్తి, సబ్ రిజిస్ట్రార్ మధుసూదన్ రావులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన ప్రారంభోత్సవంలో పాల్గొనగా, జిల్లా సహకార శాఖ అధికారి కె చంద్రశేఖర రావు, డివిజనల్ సాకార అధికారి వివి ఫణి కుమార్, హెచ్ పి సీ ఎల్ అధికారులు పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవంలో పాల్గొనగా, ఈ కార్యక్రమాలలో గుడివాడ ఆర్టీవో బాలసుబ్రమణ్యం, తాసిల్దార్ బి లోకరాజు, ఎంపీడీవో ఇన్చార్జి సారథి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన గుడివాడ అభివృద్ధికి మంత్రివర్గమంతా ప్రాధాన్యతనిస్తుంది : మంత్రి సత్యప్రసాద్

- గుడివాడ అభివృద్ధికై.. మంత్రి అనగాని సత్యప్రసాద్ కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడివాడ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** అన్న ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన గుడివాడ నియోజకవర్గానికి ప్రత్యేకత ఉందని.. గుడివాడ అభివృద్ధికి మంత్రివర్గమంతా ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి అనగానీ సత్య ప్రసాద్ అన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి.. మంత్రి సత్యప్రసాద్ పట్టణంలోని తాసిల్దార్, ఆర్డిఓ కార్యాలయాలు.. ప్రభుత్వ గెస్ట్ హౌస్ ప్రాంగణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గుడివాడ అభివృద్ధికై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.. మంత్రి సత్యప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. తక్షణమే స్పందించిన మంత్రి సత్య ప్రసాద్ మొదటి పేజ్ లోనే గుడివాడలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి సత్య ప్రసాద్.. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో ఫోన్లో మాట్లాడగా.. గుడివాడలో అత్యాధునిక ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ముందుకు వచ్చారు.. ఈ మేరకు మంత్రి రవికుమార్.. ఎమ్మెల్యే రాముతో ఫోన్లో మాట్లాడుతూ.. సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపితే వెంటనే అనుమతి ఇస్తాననీ చెప్పడంతో.. మంత్రికి ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మంత్రి సత్య కుమార్ మీడియాతో మాట్లాడుతూ గుడివాడలో బ్రిటిష్ కాలం నాటి భవనాల్లో తాసిల్దార్, ఆర్డీవో కార్యాలయాలు ఉండటానికి గుర్తించామన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విజ్ఞప్తి మేరకు.. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం మొదటి పేజ్ లోనే.. గుడివాడలో కార్యాలయాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తనకు సోదర సమానుడైన వెనిగండ్ల రాము గుడివాడ అభివృద్ధికి చేస్తున్న కృషికి.. మంత్రివర్గమంతా సహకరిస్తుందని ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ అన్నారు. అన్న ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన గుడివాడ అంటే తమకు ఎంతో ప్రత్యేకమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అడిగిన వెంటనే గుడివాడ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్ లకు గుడివాడ ప్రజల తరపున.. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు జగన్ వెంటే ఉంటాను

- పార్టీ మార్పు ప్రచారంపై క్లారిటీ ఇచ్చిన ఉప్పాల రాము



**పెడన,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** పార్టీ మారే ప్రసక్తే లేదని నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి ఉప్పాల రాము అన్నారు. అస్తమించిన సూర్యుడు మళ్లీ ఉదయిస్తాడు అన్నది ఎంత నిజమో తాను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడను అన్నది అంతే నిజం అని రాము అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పెడన నియోజకవర్గానికి ఇన్చార్జిగా తనను ఎప్పుడో నియమించారు అసత్య ప్రచారాలు చేస్తున్న వారు ఇది గమనించాలని చెప్పారు రాము వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి జనసేనలోకి చేరుతున్నారని ఒక అసత్య ప్రచారం వైరల్ అవుతుంది. పలు గ్రూపుల్లో ఈ ప్రచారాలు జరుగుతున్నాయి ఇది పూర్తిగా అవాస్తవం ఇలాంటి విష ప్రచారాలు నమ్మొద్దు వైయస్సార్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను నాయకులను నట్టేట ముంచలేనుఅని రాము చెప్పారు. పార్టీ నా ప్రాణంకార్యకర్తలు నా బలం నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం ప్రజల కోసమే పని చేస్తానని రాము అన్నారు.

# వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేయండి

- రాష్ట్ర మంత్రీ కి బీబీఏ పెద్దల వినతి



**విజయవాడ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** విజయవాడ కన్స్యూమర్ ఫోరం లోని 300 కేసులను మచిలీపట్నం జిల్లా కన్స్యూమర్ ఫోరంకి బదిలీ చేయబడిన దరిమిలా దీని ఫలితంగా విజయవాడ వినియోగదారులు మచిలీపట్నం వెళ్ళుట సమస్యగా మారినందువలన గురువారం బి బి ఏ అధ్యక్షులు కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామ ప్రసాద్ రాజా, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్ కుమార్, సీనియర్ న్యాయవాది సోము కృష్ణమూర్తి తదితరులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెళ్ల మనోహర్ ని మరియు స్టేట్ కన్స్యూమర్ ఫోరం చైర్మన్ డి శ్రీనివాసరావు ని కలిసి వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లి విజయవాడలో ఒక సర్క్యూట్ బెంచ్ ని ఏర్పాటు చేసి వారానికి రెండు రోజులు విజయవాడ పరిధిలోని కేసులను, బదిలీ చేయబడిన కేసులను ఇక్కడే విచారణ చేసే విధంగా చూడాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో కార్యాచరణ రూపొందించి తెలియజేస్తామన్నారు.

# బాణసంచా అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు

- పిఠాపురం పట్టణ ఎస్.ఐ వి. మణికుమార్



**పిఠాపురం,అక్టోబరు 17 (వార్తాప్రభ)** ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా నిలువచేసినా, తయారుచేసినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించినా... చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం పట్టణ ఎస్ఐ వి. మణికుమార్ హెచ్చరించారు. మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ... రానున్న దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా తయారు చేసేవారు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలని, తయారుచేసిన బాణసంచా నిల్వ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నివాస గృహాల మధ్య, రద్దీ ప్రాంతాల్లో... ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వచేయరాదని సూచించారు. తగిన అనుమతులు పొందిన బాణసంచా విక్రయదారులు మాత్రమే తగు జాగ్రత్తలతో బాణసంచాను విక్రయించాలని, అనుమతి లేనివారు బాణాసంచా విక్రయించరాదన్నారు. పిఠాపురం పట్టణ పరిధిలో గల బంగారమ్మ రావిచెట్టు సెంటర్, చిట్టోడి తోట ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణ సంచాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. నివాస గృహాల మధ్య ఎక్కడైనా అక్రమంగా బాణసంచాను నిలువ చేసినా, తయారు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# జేసీఐ అల్యూమిని క్లబ్ ఆధ్వర్యంలో “అన్నం పర బ్రహ్మ స్వరూపం”





**గుడివాడ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** జేసీఐ అల్యూమిని క్లబ్ ఆధ్వర్యంలో జోన్ ప్రాజెక్ట్ అన్నం పర బ్రహ్మ స్వరూపంలో భాగం గా చైతన్య భారతి విద్యానికేతన్ నందు విద్యార్థినీ విద్యార్థులకు ఆహార ధాన్యాల ను పండించడం లో రైతులు పడే వ్యయ ప్రయాసలు, సమాజం లో నేడు పేద ప్రజలు ఎదుర్కొంటున్న ఆహార కొరత, జరుగుతున్న ఆహార వృధా ని ఎలా అరికట్టాలి అనే అంశం మీద అవగాహన కల్పించి.. అన్నం పరబ్రహ్మ స్వరూపం ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జోన్ వైస్ చైర్మన్ ఉరిటి రామారావు, జోన్ కో ఆర్డినేటర్ సనకా సుబ్బారావు, ముఖ్య అతిథి సీనియర్ పాత్రికేయులు డిఆర్బి ప్రసాద్, జీవన్ పబ్లిక్ స్కూల్ అధినేత కొల్లాబత్తుల రామకృష్ణ, చైతన్య భారతి విద్యా సంస్థల అధినేత పివివి భాను శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఎయిడెడ్ ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వానికి ఉపాధ్యాయ నాయకుల డిమాండ్



**వీరులపాడు, అక్టోబరు 17 (వార్తాప్రభ) :** మండలం లో జుజ్జూరు కేంద్రంలో ఉపాధ్యాయ సమస్యలపై పరిష్కరించాలని కోరుతూ జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ మండలంలో ని సమస్యల పరిష్కరించుకోవాలని కోరారు. పలు ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థలు పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ సమావేశం లో జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు మోహన్ కృష్ణా కోరారు. వారు మాట్లాడుతూ అనేక తాపాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళమని సమస్యల పరిష్కరించడానికి ప్రభుత్వం వ్యాపియం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు గత ప్రభుత్వంలో 2021 సంవత్సరం ఆగస్టు నెలలో go no.50ని ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ఏయిడేట్ పాఠశాలలు చాలా వరకు మూసి వేసింది. స్వాతంత్రం పూర్వం నుండి మారుమూల ప్రాంతాల్లో విద్య సేవా అందిస్తున్న ఎయిడెడ్ పాఠశాల కు రాబోయే రోజులు లో గ్రాంట్ నిలుపుదల జరుగుతుంది అని ఎయిడెడ్ పాఠశాలలోని విద్యార్థులు సమీప ప్రభుత్వ పాఠశాలలోనికి చేర్చడం ద్వారా ఎయిడెడ్ పాఠశాలలకు రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల మూసి వేయబడ్డాయి.. ఐతే ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తే ఉపాధ్యాయులు సిబ్బందికి మాత్రం అన్యాయం జరిగింది. 1) ఎయిడెడ్ పాఠశాలలో ఉన్న మండలంలోని ఉపాధ్యాయులను సమీప ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేస్తామన్నారు కానీ ఆచరణలో ఎయిడెడ్ ఉపాధ్యాయులను చాలా దూరం ప్రాంతాల పాఠశాలలో విలీనం చేశారు ప్రస్తుతం ఉపాధ్యాయులు అందరూ 50 సంవత్సరాలు పైబడి దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతూ పయనం ప్రయాణం చేస్తూ దూర ప్రాంతంలో పాఠశాలలో పనిచేస్తున్నారు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం నీ కోరుతున్నారు. 2) విలీనం ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్వీసును 0 సున్నా చేయటం జరిగింది దీనివలన రేషనల్లైజేషన్ జరిగినప్పుడు వర్క్ అడ్జస్ట్మెంట్ జరిగినప్పుడు ఈ ఎయిడెడ్ ఉపాధ్యాయులే జూనియర్గా పరికనించబడి ఇంకా చదువురా ప్రాంతాలకు వెళ్ళవలసిన పరిస్థితి వస్తుంది నూతన ప్రభుత్వం వారు అయినా విలీన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పూర్తి కాల సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని కోరుతున్నారు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వంలో వినీలమైన ఉపాధ్యాయులు 32 32 అదేవిధంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రభుత్వంలోని వినీలమైన ఉపాధ్యాయులు 588 మంది ఉన్నారు.

# క్యాన్సర్, గుండెపోటు వ్యాధులను తగ్గించడం, నిరోధించే లక్ష్యం

- ఆపి అధ్యక్షులు డాక్టర్ సతీష్ కత్తుల



**హైదరాబాదు,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** భారతదేశంలో క్యాన్సర్ వ్యాప్తిని, గుండెపోటు వ్యాధులను తగ్గించే లక్ష్యంగా 18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్ న్యూఢిల్లీలో ఈనెల 18, 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆపి ( అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్) అధ్యక్షులు డాక్టర్ సతీష్ కత్తుల వెల్లడించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న గ్లోబల్ హెల్త్ సమ్మిట్ కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ , కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా, ప్రపంచవ్యాప్తంగా వివిధ వైద్య విభాగాల్లో నిష్ణాతుల్కెన భారతీయ వైద్యనిపుణులు, వైద్య పరిశోధకులు, వందలాది మంది వైద్యవిద్యార్థులు హాజరవుతున్నారన్నారు. గురువారం గురువారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్లో అకడమిక్ సెషన్స్ ను నిర్వహిస్తున్నామని, ఈ సెషన్స్ లో వైద్యనిపుణులు, పరిశోధకుల తోపాటు పాలసీమేకర్స్ అందరూ హాజరవుతున్నారని వెల్లడించారు. ఈ సదస్సులో ప్రధానంగా అనేక మంది పరిశోధకులు దేశంలో క్యాన్సర్, గుండెపోటు జబ్బులపై జన్యుపరమైన అంశాలు, వాతావరణ పరిస్థితులు ఎలాంటి ప్రభావాన్ని చూపుతున్నాయన్న విషయమై తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తున్నారన్నారు. అదేవిధంగా ఈ వ్యాధులను నిరోధించే చర్యల్లో భాగంగా సరైన వ్యాయామం, సమతుల్యమైన ఆహారంతో కూడిన జీవనశ్కెలిని ప్రజలు అలవర్చుకునేలా చెయ్యడం చాలా ముఖ్యమనన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజల జీవనశ్కెలికి అనుగుణంగా ప్రభుత్వాలు విధాన నిర్ణయాలను తీసుకోవడం, కార్యక్రమాలను అమలు చేయడంతో వ్యాధినిరోధక చర్యలు సత్ఫలితాలను సాధిస్తాయన్నారు. అలాగే ఈ సదస్సు ద్వారా అనేక సంస్థల భాగస్వామ్యంతో కమ్యూనిటీ పరంగా సరైన ఆరోగ్య చ్కెతన్యాన్ని తీసుకు వచ్చేలా కృషి చేయడం జరుగుతుందన్నారు.

# ఈ నెల 23న సాయంత్రం తెలంగాణ కేబినెట్ సమావేశం

- సచివాలయంలో సాయంత్రం 4 గంటలకు కేబినెట్ భేటీ
- హాజరు కానున్న మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు
- కేబినెట్ సమావేశంలో పలు అంశాలపై చర్చ



**తెలంగాణ,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** ఈ నెల 23వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. కేబినెట్ భేటీకి మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. కేబినెట్ భేటీలో పలు అంశాలపై చర్చించనున్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు, హైడ్రా ఆర్డినెన్స్కు చట్టబద్ధత, రెవెన్యూ చట్టం, మూసీ బాధితులకు న్యాయం చేసే అంశం, వరద నష్టం, రైతు భరోసాపై చర్చించే అవకాశముంది. అన్ని వివరాలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు అందాయి. అటు, ఈ నెలాఖరున అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు కూడా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

# వాల్మీకి కారణజన్ముడు - ఇంచార్జ్ హెచ్ ఎం ఇందిరా



**జి.కొండూరు,అక్టోబరు 17 (వార్తాప్రభ) :** రామాయణాన్ని అందించి న ఆదికవి వాల్మీకి మహర్షి కారణ జన్ముడని గంగినేనిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపా ధ్యాయులు ఇందిరా అన్నారు. గురువారం పాఠశాలలో వాల్మీకి జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ కార్యదర్శి డా. పి.నాగరాజు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి అసలు పేరు రత్నాకరుడని నారద మహర్షిచే జ్ఞానోదయం పొంది వాల్మీకి మహర్షిగా మారి రామాయణ రచనకు పూనుకున్నాడని తెలిపారు. అన్నదమ్ములు తల్లిదండ్రులు ఎలా ఉండాలి అనే విషయాన్ని తెలియజేశా రన్నారు. అంతేకాక నాటి భౌగోళిక విషయాలు సీతారాముల కళ్యాణం గురించి చక్కగా వాల్మీకి మహర్షి తెలియజేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించబడటం సంతోషించదగిన విషయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**In the Court of the VIIth Addl. Senior Civil Judge At Vijayawada**
O.S. No. 280/2023
Between :-
Kappera Siva Durga Prasad And Two Others ... Plaintiffs
And
Kappera Hymavathi And Two Others ... Defendents

1). Kappera Hymavathi, W/o. Rayabarapu Rajasekhar, D/o. Late Kappera Venkateswara Rao, R/o. D.No. 32-42-37, 1st Mayar Street, Maruthi Nagar, Vijayawada. ... D1
2). Golla Narayana Rao, S/o. Radha Krishna Murthi, R/o. F1, AB Towers, Mogal Raj Puram, Vijayawada. ... D2
3). CH. Koteswari, W/o. Satyanarayana, R/o. D.No. 30-22-7/9, Vijaya Talkies Ladies Gate Street, Karmikapuram, Vijayawada. ... D3

పై నెంబరు దావాలోని 1,2 మరియు 3 ప్రతివాదులు అయిన మీరు పై కోర్టు వారి ఎదుట హాజరు నిమిత్తము ది. 1-11-2024 నకు వాయిదా అయి వున్నది. కావున మీరు ది. 1-11-2024న ఉదయం గం. 10-30 ని.లకు స్వయముగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై అక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల దావా మీ పరోక్షమున తీర్మానింపబడును.
(By Court Order)
వేమూరి సాయి పూర్ణ చంద్రరావు
వాదుల తరఫున న్యాయవాది
విజయవాడ.
17-10-2024

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188